بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ   نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ   وَعَلٰی عَبۡدِہِ الۡمَسِیۡحِ الۡمَوۡعُوۡدِ

وَلَقَدۡ نَصَرَکُمُ اللّٰہُ بِبَدۡرٍ وَّاَنۡتُمۡ اَذِلَّۃٌ

# బదర్

(Telugu)వార పత్రిక ఖాదియాన్

Weekly **BADAR**
Qadian

www.akhbarbadr.in

## పవిత్ర ఖుర్ఆన్ బోధనలు

اِنَّاۤ اَنۡزَلۡنٰہُ فِیۡ لَیۡلَۃِ الۡقَدۡرِ ۚ۝ وَمَاۤ اَدۡرٰٮکَ مَا لَیۡلَۃُ الۡقَدۡرِ ؕ۝ لَیۡلَۃُ الۡقَدۡرِ ۬ۙ خَیۡرٌ مِّنۡ اَلۡفِ شَہۡرٍ ؕ۝ تَنَزَّلُ الۡمَلٰٓئِکَۃُ وَالرُّوۡحُ فِیۡہَا بِاِذۡنِ رَبِّہِمۡ ۚ مِنۡ کُلِّ اَمۡرٍ ۛۙ۝ سَلٰمٌ ۟ۛ ہِیَ حَتّٰی مَطۡلَعِ الۡفَجۡرِ ٪۝

అనువాదం: నిశ్చయముగా దానిని మేము గౌరవప్రదమైన రాత్రియందు అవతరింపజేసితిమి. గౌరవ ప్రదమైన రాత్రి ఏమిటో మీకు ఏమి తెలుపవలెను. గౌరవ ప్రదమైన రాత్రి వెయ్యి నెలల కంటే ఉత్తమమైనది. అందులో దేవదూతలు, పవిత్రాత్మ తమ ప్రభువు ఆదేశముతో ప్రతి విషయములో తరుచుగా అవతరింతురు. శాంతి గలదు, ప్రాత:కాలము వరకు ఈ (పద్దతి) నడుచుచుండును.

**(అల్ ఖదర్, 97వ అధ్యాయం)**

సంపుటి: **11.** సంచిక : **-13.** సంపాదకులు: సయ్యద్ రసూల్ నియాజ్ , ఉపసంపాదకులు: ముహమ్మద్ అక్బర్. వార్షిక చందా: **600/-**రూ॥
తేది: **26** మార్చి - **02** ఏప్రిల్ **2026** క్రీ, శ. **06- 13** షవ్వాల్ **1447** హి,ఖ. **26** అమాన్ - షహాదత్ **1405** హి, శ.

ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ప్రవచనాలు:

## లైలతుల్ ఖద్ర్ ప్రాధాన్యత, చిన్న చిన్న పాపముల పరిహారం.

హజ్రత్ అబూహురైరహ్ రజియల్లాహు అన్హు ఇలా ఉల్లేఖించారు. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా తెలిపారు. రమజాన్ మాసం ప్రారంభమైనది. ఇది చాలా శుభప్రదమైన మాసం. అల్లాహ్ తాలా రమజాన్ మాసపు ఉపవాసాలను పాటించడం మీపై విధిగావింపజేశాడు. ఈ మాసంలో స్వర్గపు ద్వారములు తెరువబడుతాయి, నరకపు ద్వారములు మూసివేయబడుతాయి. షైతాన్ బంధించబడుతుంది. ఈ మాసంలో ఒక ప్రత్యేకమైన రాత్రి గలదు. అది వెయ్యి నెలల కంటే ఎంతో ఉత్తమమైనది. ఎవరైతే ఆ రాత్రియొక్క శుభములను జారవిడుచుకుందురో వారు దౌర్భాగ్యులనబడుతారు.

**(మస్నద్ అహ్మద్ బిన్ హంబల్, సంపుటి 2, పేజి 425)**

హజ్రత్ అబూహురైరహ్ రజియల్లాహు అన్హు ఇలా ఉల్లేఖించారు. ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా తెలిపారు. ఐదు పూటల నమాజ్‌లు, ఒక జుమా మరోజుమాకు ఒక రమజాన్ మరో రమజాన్‌కు వాటి మధ్య కాలంలో చోటుచేసుకున్న చిన్న చిన్న పాపములకు పాప పరిహారం. అయితే అతడు పెద్ద పెద్ద పాపముల నుండి తనను తాను కాపాడుకొనువాడై ఉండవలెను.

**(సహి ముస్లిం, కితాబుల్ తహ్హారత్, బాబ్ స్వలాతుల్ ఖమ్స్)**

**సూఫీలు ఇలా పొందుపరిచారు. మనస్సును కాంతివంతముగా చేసుకొనుటకు ఈ మాసము ఎంతో శ్రేష్టమైనది. ఈ మాసంలో అసంఖ్యాకముగా దివ్యస్వప్నములు కనిపిస్తుంటాయి. నమాజ్ మనస్సును పవిత్రం చేస్తుంది. ఉపవాసం మనస్సును తేజోవంతం చేస్తుంది.**

**(ఉపదేశములు: హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం)**

సయ్యదినా హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇలా తెలిపారు: " షహ్రు రమజానల్లజీ ఉన్‌జిల ఫీహిల్ ఖుర్ఆను " (బఖర:186) నుండి రమజాన్ మాసపు ప్రాధాన్యత తెలుస్తుంది. సూఫీలు ఇలా పొందుపరిచారు. మనస్సును కాంతివంతముగా చేసుకొనుటకు ఈ మాసము ఎంతో శ్రేష్టమైనది. ఈ మాసంలో అసంఖ్యాకముగా దివ్యస్వప్నములు కనిపిస్తుంటాయి. నమాజ్ మనస్సును పవిత్రం చేస్తుంది. ఉపవాసం మనస్సును తేజోవంతం చేస్తుంది. మనస్సును పవిత్రం చేయడమనగా, మోహపూరిత మనస్సు అశ్లీలత నుండి దూరం ఉంటుంది. మనస్సు తేజోవంతం అవుతుందనగా, దైవత్వంను ధర్శించుకోవడానికి దివ్య స్వప్నముల ద్వారాలు తెరుసుకోబడుతాయి. మొత్తానికి ఉన్‌జిల ఫీహిల్ ఖుర్ఆన్ (బఖర:186)లో ఈ విషయమే దాగియున్నది. ఉపవాసానికి అత్యంత వైభవమైన ప్రతిఫలం ఉన్నది అనుటలో ఎలాంటి అనుమానం, సంశయం లేదు. కాని జబ్బులు, అత్యవసర పరిస్థితులు మానవున్ని అట్టి అనుగ్రహం నుండి దూరం చేస్తాయి. నాకు చాలా బాగా గుర్తున్న విషయమేమనగా, యుక్త వయస్సులో నేను ఒక కలను చూశాను. అందులో ఉపవాసంను పాటించడం ప్రవక్త కుటుంబీకుల సాంప్రదాయమని తెలపడం జరిగింది. నా పక్షంలో దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా తెలిపారు. సల్‌మాను మిన్నా అహ్లల్ బయితి. సల్మాన్ అనగా అస్సుల్‌హాన్ అనగా ఆ వ్యక్తి ద్వార రెండు ఒప్పందాలు జరుగును. ఒకటి అంతర్గతముగా, మరొకటి బాహ్యముగా. ఈ పనిని వారు ఖడ్గంతో కాకుండా స్నేహ బంధంతో పూర్తి చేయుదురు. అంతేగాకుండా నేను యుద్ధం చేసినటువంటి హుసైన్ విధానంతో కాకుండా, యుద్ధం చేయనటు వంటి హసన్ విధానంతో నడుచుకోవలసి యుండెను. అందువలన నేను ఉపవాసాల వైపు సూచించడం జరుగుతుందని భావించాను. అందువలన నేను 6 నెలల పాటు ఉపవాసాలు పాటించాను. ఆ క్రమంలో నేను తేజస్సుతో కూడిన అనేక స్థూపాలు ఆకాశం వైపుకు వెళ్ళడం చూశాను. అయితే ఈ తేజస్సుతో కూడిన స్థూపాలు భూమి నుండి ఆకాశంకు వెళ్ళు చున్నాయా? లేక నా మనస్సులో నుండి వెళ్ళు చున్నాయా? అనే విషయం సందిగ్ధంగా ఉన్నది. కాని ఇవన్నియు యుక్త వయస్సులో సాకారమవుతాయి. ఒకవేళ నేను కోరుకున్నచో ఆ సమయంలో 4సంవత్సరాల పాటు ఉపవాసాలను పాటించే వాడిని.

نشاط و جوانی تا بہ سی سال
چہل آمد فرو ریزد پر و بال

**(10వ పేజిలో చదువుము)**

## ప్రతి వ్యక్తి యొక్క సంపదలో అతని బంధువుల, నిరుపేదల, బాటసారుల హక్కు ఉంటుంది.

హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ రజియల్లాహు అన్హు బనీ ఇస్రాయిల్ అధ్యాయపు 27 సూక్తి వ ఆతిజల్ ఖుర్బా హఖ్ఖహు వల్ మిస్‌కీన వబ్‌నస్సబీలి వలా తుబజ్జిర్ తబ్‌జీర ను విశ్లేషిస్తూ ఇలా పేర్కొన్నారు:

(అనువాదం: బంధువునకు, బీదవానికి, ప్రయాణికునికి కూడ వారి హక్కును ఇచ్చివేయుము. కాని అనవసర ఖర్చు చేయకుము)

ఈ సూక్తిలో తెల్పబడిన విషయమేమనగా, ప్రతి వ్యక్తి యొక్క సంపదలో అతని బంధువుల, నిరుపేదల, బాటసారుల హక్కు ఉంటుంది. మానవుని ఆర్జితంలో బంధువులు అనేక విధాలుగా సహాయకులుగా నిలుస్తారు. అందుకే వారి సంపదలో ఆ బంధువులందరి హక్కు ఉంటుంది. ఉదా॥ తల్లిదండ్రులు ఒక కుమారుడిని బాగా చదివించారు. ఫలితముగా అతడు ఉన్నత స్థాయికి చేరుకున్నాడు. మిగిలిన అతని సోదరులు విద్యాభ్యాసం నుండి దూరంగా ఉన్నచో, అట్టి ఉన్నత స్థాయిని పొందిన సోదరుడి సంపదలో మిగిలిన సోదరుల హక్కు కూడ ఉంటుంది. ఎందుకనగా ఏ డబ్బుతో అతనిని చదివించడం జరిగిందో, ఆ డబ్బులో వీరందరి భాగం కూడ ఉంటుంది.

అదే విధముగా నిరుపేదల మరియు బాటసారుల హక్కులను కూడ అల్లాహ్ తాలా కేటాయించాడు. ఈ విషయాన్నే మరొక చోట వివరముగా ప్రస్తావించుతూ ఇలా తెలిపాడు.

**(10వ పేజిలో చదువుము)**

## అహ్మదియ్యా వార్తలు

సయ్యద్నా హజ్రత్ అమీరుల్ మోమినీన్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారు అల్లాహ్ దయతో క్షేమంగా ఉన్నారు. **(అల్ హందులిల్లాహ్)**

జమాఅత్ సభ్యులు హుజూరె అన్వర్ కొరకు ప్రత్యేముగా దుఆలు చేయగలరు. అల్లాహ్ తాలా హుజూర్ అన్వర్‌కు ఆరోగ్య వంతమైన, చురుకైన సుదీర్ఘ జీవితంను ప్రసాదించుగాకా!. ఉన్నత ఆశయ సాధనాలను సమకూర్చు గాకా!,అనుక్షణం హుజూర్‌ను రక్షించుచూ దైవదూతలతో సహాయ, సహకారములు అందించుగాక!

జమీల్ అహ్మద్ నాసిర్, ప్రింటర్ పబ్లిషర్ గారు ఫజ్లె ఉమర్ ప్రింటింగ్ ప్రెస్ ఖాదియాన్‌లో ముద్రించి అఖ్బారె బదర్ ఖాదియాన్ కార్యాలయము నుండి ప్రచురించిరి. ప్రోపరైటర్, నిగ్రాన్ బదర్ బోర్డ్ ఖాదియాన్

సంపాదకీయం: لَا إِلٰهَ إِلَّا اللّٰهُ مُحَمَّدٌ رَّسُوْلُ اللّٰهِ

# పిల్లల క్రమశిక్షణ మరియు రమజాన్ మాసం. దైవభీతి యొక్క ఆచరణాత్మక పునాది.

మానవ జీవితం దాని వాస్తవికత దృష్ట్యా ఎంతో సంక్షిప్తపమైనది మరియు తాత్కాలికమైనది. ఖుర్ఆన్ కరీం ఈ వాస్తవికతను ఎంతో స్పష్టముగా తెలియజేసింది. కుల్లు నఫ్సిన్ జాఇఖతుల్ మౌత్ (ఆలే ఇమ్రాన్:182) అనగా ప్రతి ప్రాణి మరణపు రుచిని చూస్తుంది. ప్రాపంచిక జీవితం నీటి బుడగ లాంటిదనే వాస్తవాన్ని ఈ సూక్తి మనకు తెలియజేస్తుంది. ఏ వ్యక్తి కూడ ఈ ప్రపంచంలో శాశ్విత జీవనం కోసం జన్మించలేదు. అతడికి ఏదో ఒక రోజున తన సృష్టికర్త ముందు తప్పకుండ నిలబడ వలసి ఉంటుంది. ఈ ప్రాథమిక లక్ష్యముతోనే ఒక ముసల్మానుడు తన జీవితపు ప్రతి చర్యను అర్థవంతముగా మలుచుకొనుటకు ప్రయత్నిస్తూ, తన పరలోక ఏర్పాట్లను తయారు చేసుకుంటాడు. అదే విధముగా తన తరువాత తన సంతానంను గూర్చి చింతిస్తూ ఉంటాడు.

అల్లాహ్ తాలా మానవుని స్వభావంలో తన పిల్లలు ధార్మిక మరియు ప్రాపంచిక పరముగా విజేయులు కావాలని అన్ని విధాలుగా కృషిచేయు తత్వాన్ని ఇమిడింపజేశాడు. ఈ కారణంగానే ప్రతి వ్యక్తి తన శక్తి సామర్థ్యం మేరకు తన పిల్లలకు శిక్షణనిస్తాడు. ఒక విద్యావంతుడు తన పిల్లలకు విద్యాబుద్ధులను నేర్పుతాడు. ఒక వ్యాపారి తన పిల్లలకు వ్యాపార విధివిధానాలను నేర్పిస్తాడు. ఒక వైద్యుడు లేదా హకీం తన నైపుణ్యాన్ని, తన చికిత్స విధానాన్ని తన పిల్లలకు నేర్పించుటకు ప్రయత్నిస్తాడు. వీరందరి ప్రయత్నంలో ఒకే ఒక ఉద్దేశం ఉన్నది. అదేమనగా వారి సంతానం కేవలం వారి వ్యాపారతను సుస్థిర పర్చడమే కాకుండా, దానిని ఇంకా విస్తరింప జేయాలనే లక్ష్యం ఉంటుంది.

కాని ఒక ముసల్మానుడికి ఇంతకు మించిన అతి పెద్ద ప్రధానమైన బాధ్యత ఒకటి ఉన్నది. అదేమనగా తన సంతానానికి ధార్మిక విద్యను అందించడం. వారిలో దైవభక్తిని, దైవాభిమానమును కల్పిస్తూ, దైవభీతికి చెందిన మార్గంలో నడింపజేయడం. ఈ సంపదయే మానవుని జీవితం తరువాత కూడ అతని కొరకు నిరంతం కొనసాగు పుణ్య ఫలమవుతుంది. అతని శాశ్విత విజయానికి కారణమవుతుంది.

రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా తెలిపారు. మానవుడు మృతి చెందిన తరువాత అతని ఆచరణలు నిలిచిపోతాయి. కేవలం కొన్ని కొనసాగుతుంటాయి. వాటి ఒకటి వారి సంతానంలో అలవర్చిన పుణ్యకార్యములు. దీని ద్వార స్పష్టముగా తెలియునదేమనగా తమ సంతానానికి సరైన క్రమశిక్షణను నేర్పిండం కేవలం ధార్మిక ప్రయోజనాన్ని చేకూర్చడమే కాకుండా, పరలోకంలో కూడ అట్టి మానవునికి కరుణాప్రదాయినిగా మారుతుంది.

రమజాన్ మాసంను ఇట్టి క్రమశిక్షణను ఎంతో అనువైన, శుభప్రదమైన మాసంగా చెప్పుకోవచ్చును. ఈ మాసంలో ఒక ముసల్మానుడు స్వయముగా నమాజ్‌లు, ఉపావాసాలు, దుఆలు, ఖుర్ఆన్ కరీం పారాయణంలో నిమగ్నమై ఉండడమే కాకుండా, తన పిల్లలను కూడ ఇట్టి పుణ్య కార్యములో పాల్గొనేలా చేయాలని అతని మనస్సు కోరుకుంటుంది. ఈ వాతవరణంలో పిల్లల మనస్సులో కూడ నమాజ్‌లు చేయాలనే ఉత్సాహం పెరుగుతుంది. ఫలితముగా వారు తమ తల్లిదండ్రులను అనుసరిస్తుంటారు. ఉపవాసాలను పాటించుటకు, నమాజ్‌లు చేయుటకు తమ ఆకాంక్షను వెల్లడిస్తుంటారు.

అయితే ఇక్కడ ఒక ప్రధానమైన ప్రశ్న తలెత్తుతుంది. ఏ వయస్సు పిల్లలకు ఉపవాసాలను పాటించు అలవాటును అలవర్చాలి?. చిన్న పిల్లలను కూడ ఉపవాసాలు పాటించడం అని బలవంతం చేయాలా?. లేక వారికి క్రమ క్రమంగా అలవాటు చేయాలా?. కొంత మంది ఈ విషయంలో చాలా కఠినముగా వ్యవహరించడం మనకు కనిపిస్తుంది. చిన్న పిల్లలతో కూడ బలవంతముగా ఉపవాసాలను పాటింప జేస్తుంటారు. మరి కొంతమంది చాలా తేలికగా తీసుకుంటారు. అందుకే యుక్త వయస్సులోకి వచ్చిన తమ పిల్లలకు ఉపవాసం పాటించండి అని కూడ విడమర్చి చెప్పరు. ఈ విషయంలో మనకు ఖుర్ఆన్ కరీం ఒక సాధారణమైన సూత్రాన్ని తెలియజేస్తుంది. అదేమనగా క్రమశిక్షణ మరియు సత్కార్యములను గూర్చి పదే పదే తెలియజేస్తూ ఉండాలి. ఈ విషయాన్నే ఖుర్ఆన్ కరీం ఇలా తెల్పింది. **వ జక్కిర్ ఫ ఇన్న జ్జిక్‌రా తన్‌ఫుల్ మోమినీన్** (జారియాత్:56) మీరు గుర్తు చేస్తూనే ఉండండి. ఎందుకనగా నిశ్చయముగా గుర్తుచేయడం అనేది విశ్వాసులకు ప్రయోజనాన్ని చేకూర్చుతుంది.

ఈ సూత్రమును అనుసరించే హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ రజియల్లాహు అన్‌హు గారు ఎంతో వివేకవంతమైన విధానంలో పిల్లల ఉపవాసాలను గూర్చి ఒక మార్గదర్శకమైన సూచనను తెలిపారు. వారు రజి ఇలా తెలిపారు.

" చాలా మంది చిన్న పిల్లలతో కూడ ఉపవాసాలను పాటింపజేస్తారు. వాస్తవానికి ప్రతి ఒక్క విధికి, ఆదేశానికి వేరు వేరు హద్దులు, వేరు వేరు సమయాలు నిర్ధేశించబడి ఉన్నాయి. నా దృష్టిలో కొన్ని ఆదేశాల పాలన నాలుగు సంవత్సరాల వయస్సు నుండి ప్రారంభమవుతుంది. మరికొన్నింటి పాలన 7 నుండి 12 సంవత్సరాల మధ్య వయస్సులో ప్రారంభమవుతాయి. మరికొన్నింటి పాలన 15 నుండి 18 సంవత్సరాల మధ్య వయస్సులో ప్రారంభమవుతాయి. నా దృష్టిలో ఉపవాసాల ఆదేశం 15 నుండి 18 సంవత్సరాల వయస్సుకు చెందిన బాలబాలికపై పాటించబడుతుంది. నిజానికి ఇదే యుక్తవయస్సుకు చెందిన పరిది.

నా దృష్టిలో ఇంతకంటే ముందు వయస్సు నుండే పిల్లలతో ఉపవాసాలను పాటింప జేసినచో వారి ఆరోగ్యంపై చాలా ప్రభావంను చూపుతుంది. ఎందుకనగా ఆ సమయంలో వారు శక్తిని మరియు సామర్థ్యంను పెంపొందించుకుంటూ ఉంటారు. కావున ఏ సమయంలో వారు శక్తి, సామర్థ్యములను సమకూర్చుకుంటారో, ఆ సమయంలో శక్తిని అణిచివేయడం, లేదా సమకూర్చుకోకుండా చేయడం వారి కొరకు చాలా ప్రమాధకరంగా మారవచ్చును. ఆయిల్ ఇంజన్‌కు గాని, ఇతర ఇంజన్‌లకు గాని అధిక ఉష్ణోగ్రతను మాత్రమే విడుదల చేయడంను మనం చూస్తుంటాము. అంతేగాని ఇంజన్ ఉష్ణోగ్రతను సమకూర్చుకుంటున్న సమయంలో గాని, ఊష్ణం తయారు అవుతున్న సమయంలో గాని ఎవరు కూడ దానిని బయటికి విడదల చేయరు. నదిలో నీటి ప్రవాహం అధికముగా ఉన్నప్పుడే నదిపై డ్యాంను కట్టి ఆ నీటికి మరోవైపు మళ్ళించగలము. కాని అసలు నదిలో నీటి ప్రవాహమే లేకున్నచో, నీటిని బయటికి విడుదల చేయడమే జరుగదు. మొత్తానికి పిల్లలు ఏ వయస్సులోనైతే శక్తి, సామర్థ్యములను సమకూర్చుకుంటారో అనగా 15 సంవత్సరాల వయస్సుకు చేరక ముందే, ఆ సమయంలో వారితో ఉపవాసాలను పాటింప జేయకూడదు. ఎందుకనగా అంతకంటే ముందు పిల్లలపై ఉపవాసం విధిగావించ బడదు. కావున ఆ వయస్సలో పిల్లలతో ఉపవాసాలు పాటింప జేయకూడదు. అంతేగాకుండా పిల్లలు కూడ స్వయముగా ఉపవాసాలు పాటించకుండా చూడాలి. ఎందుకనగా పిల్లలకు కూడ ఉపవాసాలు పాటించాలనే ఉత్సాహం ఉంటుంది. "

హుజూర్ రజి మరల ఇలా తెలిపారు. " 12 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు గల పిల్లలతో ఉపవాసాలు పాటింపజేయడం నా దృష్టిలో నేరం. 12 నుండి 15 సంవత్సరాల పిల్లలతో ఒకవేళ ఎవరైన ఉపవాసాలను పాటింపజేసినచో ఎలాంటి తప్పు లేదు. 15 సంవత్సరాల వయస్సు నుండి పిల్లలకు ఉపవాసాలను పాటించే అలవాటును నేర్పించాలి. 18 సంవత్సరాల వయస్స నుండి ఉపవాసాలు విధిగావించ బడుతాయని భావించాలి. .... ఈ విధముగా క్రమక్రమంగా వారిలో ఉపవాసం పాటించే అలవాటును అలవరింపజేయాలి. "

**(ఖుత్బాతే మహ్మూద్, సంపుటి 9, పేజి 88-89, జుమా ప్రసంగం 13 ఏప్రిల్ 1925)**

హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ రజిగారి ఈ ఉపదేశం ఇస్లాం యొక్క అందమైన బోధనలను ప్రతిభింభింప జేస్తున్నాయి. నమాజ్‌లలో సమతూల్యం కనిపిస్తుంది. వివేకతను మరియు క్రమపద్ధతిని కూడ దృష్టియందుంచుకోవడం జరిగింది. ఇస్లాం అనవసరమైన కఠినత్వపు బోధనలను బోధించదు. నిర్లక్ష్యం వహించుటకు అనుమతించదు. నిజానికి ప్రతి విషయాన్ని దాని సముచిత సమయానికి, పరిస్థితులకు అనుగుణముగా నెరవేర్చమని నేర్పుతుంది.

అదే విధముగా అనారోగ్య పరిస్థితులలో కూడ ఖుర్ఆన్ కరీం స్పష్టమైన వెసలుబాటును కల్పించింది. దానికి తోడు మానవుని స్వాభావిక బలహీనత మరియు సాకులను గూర్చి హెచ్చరిస్తూ ఈ విధముగా తెల్పినది. ఇన్నల్ ఇన్‌సాన ఖులిఖ హలూఆన్ (ముఆరిజ్:20) అనగా నిశ్చయముగా మానవుడు తొందరపాటు మరియు బలహీన స్వభావాలతో పుట్టించబడినాడు.

ఈ విషయాన్నే ఎంతో సౌందర్యవంతముగా, స్పష్టముగా హజ్రత్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారు ఇలా తెలిపారు.

" ఖుర్ఆన్ కరీం స్పష్టముగా తెలియజేయునదేమనగా, అనారోగ్యముగా ఉన్నచో ఉపవాసంను పాటించకుము. కాని అనారోగ్యమునకు గురి అవుతాను అనే ఆలోచనలతో అనగా జబ్బుపడుతాను అనే ఉద్దేశంతో ఉపవాసంను వీడడం తప్పు. ...హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇలా తెలిపారు. ..... చాలా మంది సాకులను వెదుకుతూ ఉంటారు. ... అల్లాహ్ వారి సంకల్పాలను, ఉద్దేశాలను బాగుగా ఎరుగును. ... ఎవరైతే స్వచ్ఛతను, సత్యతతను కల్గియుంటారో వారితో అల్లాహ్ కూడ స్వచ్ఛతతో, సత్యతతో కూడిన వ్యవహారంను చూపుతాడు. కాని ఎవరైతే సాకును చూపుతారో వారి పట్ల అదే విధముగా వ్యవహరిస్తాడు. "

**(జుమా ప్రసంగం 24, ఏప్రిల్ 2020)**

శుభప్రదమైన రమజాన్ మాసం మనలను మనము సంస్కరించుకోవడమే కాకుండా, తమ సంతానాన్ని కూడ సంస్కరించుకునే మరియు సన్మార్గమును అనుసరించే సువర్ణ అవకాశంను మనకు కల్పిస్తుంది.

కావున ఇట్టి అవకాశం నుండి ప్రయోజనం పొందు భాగ్యమును అల్లాహ్ తాలా మనందరికి కల్పించుగాకా! ఆమీన్.

❁ ❁ ❁

# జుమా ప్రసంగము

**ఏదైనా ఒక గుణంలో అత్యుత్తమ నైపుణ్యం కలిగిన వారు మాత్రమే ఇతరులకు ఆదర్శంగా నిలవగలరు. ఇక హ॥జ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం గారిని చూసినచో, ప్రవక్త (స) సర్వశక్తిమంతుడైన అల్లాహ్‌కు చెల్లించవలసిన హక్కుల విషయంలో అయినా, లేదా అల్లాహ్ దాసులకు చెందవలసిన హక్కుల విషయంలో అయినా, ఈ రెండు సద్గుణాలలోనూ ప్రవక్త (స) అత్యున్నత స్థానాన్ని కలిగి ఉండే వారు, ఇందుకు స్వయంగా అల్లాహ్‌యే సాక్ష్యం ఇచ్చాడు.**

---

**సర్వశక్తిమంతుడైన అల్లాహ్‌కు మన ఆరాధన అవసరం లేదు. కానీ,అల్లాహ్ మీకు ప్రసాదించిన ఆధ్యాత్మిక మరియు ప్రాపంచిక వరాలకు బదులుగా, మీరు ఆయనకు కృతజ్ఞత తెలిపే హక్కును నెరవేర్చాలని మరియు ఆయనకు కృతజ్ఞతగల సేవకులుగా మారాలని ఆయన కోరడం లేదా?.**

---

**దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) షిర్క్‌ను (అల్లాహ్‌కు భాగస్వాములను కల్పించడం) ఎంతగా ద్వేషించే వారంటే, వారు (స) మరణ సమయంలో, చివరి క్షణాల్లో బాధపడుతున్నప్పుడు కూడా, కొన్నిసార్లు కుడివైపుకు, మరికొన్నిసార్లు ఎడమవైపుకు తిరిగి పడుకుని, పదేపదే ఇలా అనేవారు: "తమ ప్రవక్తల సమాధులను ఆరాధనా స్థలాలుగా మార్చిన ఆ యూదులను, క్రైస్తవులను అల్లాహ్ శపించుగాకా!"**

---

**దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) యొక్క ఆదర్శాన్ని అనుసరించి, నిజమైన ముస్లింలుగా మారడానికి కృషి చేసే సామర్థ్యాన్ని సర్వశక్తిమంతుడైన అల్లాహ్ మనకు ప్రసాదించుగాకా!. వారి సందేశాన్ని ప్రపంచమంతటా వ్యాపింపజేసి, తద్వారా మానవాళిని వారి పతాకం క్రిందకు తీసుకువచ్చే సామర్థ్యాన్ని కూడా అల్లాహ్ మనకు ప్రసాదించుగాకా! అలా చేయడానికి సర్వశక్తిమంతుడైన అల్లాహ్ మనకు శక్తిని ప్రసాదించుగాకా!.**

**సయ్యద్నా అమీరుల్ మోమినీన్ హ॥జ్రత్ మిర్జా మస్రూర్ అహ్మద్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ (క్రీ.శ 19 డిసంబర్ 2025, ( 19 ఫతహ్ 1404 హి.శ) తేదిన మస్జిద్ ముబారక్ ఇస్లామాబాద్‌లో ప్రసంగించిన జుమా ఖుత్బా.**

أَشْهَدُ أَنْ لَّا إِلٰهَ إِلَّا اللّٰهُ وَحْدَهُ لَا شَرِيْكَ لَهُ وَأَشْهَدُ أَنَّ مُحَمَّدًا عَبْدُهُ وَرَسُوْلُهُ

أَمَّا بَعْدُ فَأَعُوْذُ بِاللّٰهِ مِنَ الشَّيْطٰنِ الرَّجِيْمِ - بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ

اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعٰلَمِيْنَ - اَلرَّحْمٰنِ الرَّحِيْمِ - مٰلِكِ يَوْمِ الدِّيْنِ

إِيَّاكَ نَعْبُدُ وَإِيَّاكَ نَسْتَعِيْنُ - اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ

صِرَاطَ الَّذِيْنَ أَنْعَمْتَ عَلَيْهِمْ غَيْرِ الْمَغْضُوْبِ عَلَيْهِمْ وَلَا الضَّآلِّيْنَ

لَقَدْ كَانَ لَكُمْ فِيْ رَسُوْلِ اللّٰهِ أُسْوَةٌ حَسَنَةٌ لِّمَنْ كَانَ يَرْجُوا اللّٰهَ وَالْيَوْمَ الْآخِرَ وَذَكَرَ اللّٰهَ كَثِيْرًا (الاحزاب:22)

**అల్లాహ్ తాలా ఇలా తెల్పుచున్నాడు. అనువవాదం: నిశ్చయముగా మీ కొరకు (అనగా) అల్లాహ్‌ను, పరలోక దినమును నమ్ముచు అల్లాహ్‌ను తరుచుగా స్తుతించు ప్రతి వాని కొరకు అల్లాహ్ ప్రవక్తలో మంచి ఆదర్శమున్నది.**

**(అహ్‌జాబ్: 22)**

ఒకసారి హ॥జ్రత్ ఆయిషా రజియల్లాహు తాలా అన్‌హాను హ॥జ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం గారి శ్రేష్ఠమైన నైతిక విలువలు మరియు ఉన్నతమైన స్వభావం గురించి చెప్పమని ఒకరు అడిగారు. అందుకు హ॥జ్రత్ ఆయిషా రజి ఇలా సమాధానమిచ్చారు, "మీరు పవిత్ర ఖురాన్‌ను చదవడం లేదా?" సర్వశక్తిమంతుడైన అల్లాహ్ తాలా స్వయంగా ఖుర్‌ఆన్‌లో ప్రవక్త (స) గారి శ్రేష్ఠమైన స్వభావానికి సాక్ష్యమిచ్చాడు. అల్లాహ్ తాలా ఇలా తెలిపాడు. వ ఇన్నక లఅలా ఖుల్‌ఖిన్ అజీమ్. (ఖలమ్:5) అనగా ఓ ప్రవక్త! నిశ్చయంగా నీవు ఉన్నతమైన నైతిక గుణాల అత్యుతన్నత స్థాయిని కలిగియున్నావు."

**( ముస్నద్ అహ్మద్ బిన్ హంబల్, సంపుటి 8, పేజి 144 -145, ముసన్నిద్ ఆయిషా రజి, ఆలముల్ కుతుబ్, బీరుత్)**

ఏదైనా ఒక గుణంలో అత్యుత్తమ నైపుణ్యం కలిగిన వారు మాత్రమే ఇతరులకు ఆదర్శంగా నిలవగలరు. ఇక హ॥జ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం గారిని చూసినచో, ప్రవక్త (స) సర్వశక్తిమంతుడైన అల్లాహ్‌కు చెల్లించవలసిన హక్కుల విషయంలో అయినా, లేదా అల్లాహ్ దాసులకు చెందవలసిన హక్కుల విషయంలో అయినా, ఈ రెండు సద్గుణాలలోనూ ప్రవక్త (స) అత్యున్నత స్థానాన్ని కలిగి ఉండే వారు, ఇందుకు స్వయంగా అల్లాహ్‌యే సాక్ష్యం ఇచ్చాడు. అందువల్ల, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ఇలా పేర్కొన్నారు: "ఈ ప్రవక్త (సల్లల్లహు అలైహి వసల్లం) మీకు ఒక ఆదర్శం. కావున మీరు కేవలం వారి మాటలను వినడమే కాకుండా, వాటికి అనుగుణంగా నడుచుకోండి. కేవలం విశ్వాసాన్ని ప్రకటించడంతో సరిపోదు. మీరు ఈ బోధనలకు అనుగుణంగా నడుచుకున్నప్పుడే, ఈ ప్రవక్త అవతరణ లక్ష్యమైన ఆ ఉన్నత స్థానాన్ని మీరు నిశ్చయంగా పొందగలుగుతారు."

కావున, ఇది ప్రతి ముస్లిం, ప్రతి విశ్వాసి యొక్క బాధ్యత. ప్రపంచంలో కొందరు కొన్ని మంచి పనులు చేస్తారు, లేదా వారు చేసిన పని అందరికీ తెలిసేలా చేస్తారు, దాని ఫలితంగా వారు ప్రసిద్ధి చెంది, ప్రశంసలు మరియు బహుమతులు అందుకుంటారు. కొందరు నోబెల్ బహుమతిని అందుకుంటే, మరికొందరు ఇతర రకాల బహుమతులను పొందుతారు. కాని, ఈ బహుమతిని ఏదేని కమిటి లేదా ప్రభుత్వం తాము నియమించిన పనికోసం తమ వైపు నుండి ఇవ్వడం జరుగుతుంది. అంతేగాని దేశ ప్రజలందరు ఏకగ్రీవంగా ఇలా బహుకరించిన సందర్భం ఎప్పుడూ రాలేదు.

హ॥జ్రత్ ముహమ్మద్ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంను ప్రవక్తుత్వ ప్రకటనకు ముందే, యవ్వనంలో ఉన్నప్పుడు, ప్రజలు వారికి 'సాదిఖ్' (సత్యవంతుడు) మరియు 'అమీన్' (విశ్వసనీయుడు) అనే బిరుదులు ఇచ్చారు. ఇవే అసలైన బహుమానాలు.

**(సీరతున్నబవియ్యతు లి ఇబ్న్ హిషామ్, పేజి 155, ..... దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బీరూట్) ( సహీ-బుఖారీ, కితాబు-తఫ్సీర్, హదీస్ 4792)**

అనగా ప్రవక్త (స)కు ఎలాంటి ప్రశంసల అవసరం లేనప్పటికీ, ప్రజల దృష్టిలో వారు సాటిలేని స్థాయికి చేరుకున్నారు, మరియు సమాజం మొత్తం వారికి ఈ బిరుదును ఇచ్చింది. అందువల్ల, ఇది హ॥జ్రత్ ముహమ్మద్ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం గారి ఉన్నతమైన స్థానం. ప్రవక్త (స) స్వయంగా ఇలా అన్నారు: "మీరు నా సాంప్రదాయంను (సున్నత్)ను అనుసరిస్తూ, ఆచరించాలి."

**(సునన్ అబీ దావూద్, కితాబ్ అస్-సున్నహ్, హదీస్ 4607)**

ఎందుకంటే సర్వశక్తిమంతుడైన అల్లాహ్ మీ సంస్కరణ కోసం నన్ను పంపాడు. ఉన్నత నైతిక గుణాలను పరిపూర్ణం చేయడానికి తాను పంపబడ్డానని ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం పేర్కొన్నారు.

**(సునసుల్ కుబ్రా లిల్ బైహఖీ, సంపుటి 10, పేజి 318, కితాబు ష్షహాదాత్ ..... హదీస్ 21379, మక్తబతుర్రషీద్, రియాద్,)**

కావున ఎవరైతే ఈ సంపూర్ణ లక్షణాలను కల్గియుంటారో, ఎవరిలోనైతే ఈ విశిష్టతలన్నియు కనిపిస్తుంటాయో వారే తన నైతికతను పరిపూర్ణం చేసుకున్నారని చెప్పవచ్చు.

నేను ఇంతకు ముందే చెప్పినట్లుగా, ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) మనకు ఒక ఉత్తమ ఆదర్శమని సర్వశక్తిమంతుడైన అల్లాహ్ స్వయంగా చెప్పాడు. అందువల్ల, మనం వారు చెప్పిన ప్రతి మాటకు అనుగుణంగా నడుచుకునేలా వారి జీవితానికి గొప్ప ప్రాముఖ్యత ఇవ్వాలి. అంతేకాకుండా, వారు చెప్పిన ప్రతి మాట పవిత్ర ఖురాన్ బోధనలకు అనుగుణంగా ఉంటుంది మరియు ఆ బోధనలు సర్వశక్తిమంతుడైన అల్లాహ్ నుండి వచ్చినవి. అందువల్ల, ఒక వ్యక్తి కలిగి ఉన్న లేదా కలిగి ఉండవలసిన ప్రతి నైతిక గుణానికి, మరియు సర్వశక్తిమంతుడైన అల్లాహ్ యొక్క గుణాలను ప్రదర్శించడంలో కూడా ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఒక పరిపూర్ణ ఆదర్శం.

హ॥జ్రత్ ఖలీఫతుల్ మసీహుస్సాని రజి, ఖురాన్ అధ్యయన పరిచయంలో, ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) గారి నైతికత మరియు స్వభావానికి సంబంధించిన కొన్ని అంశాలను కూడా ప్రస్తావించారు మరియు అవి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) గారి జీవిత చరిత్ర గ్రంథాలలో కూడా ప్రస్తావించబడ్డాయి. ఈ రోజు నేను వీటిలో కొన్నింటిని సంక్షిప్తంగా ప్రస్తావిస్తాను, మరియు భవిష్యత్తులో అవకాశాలు వచ్చినప్పుడు, వాటిపై వివరముగా ప్రస్తావించుతాను.

మొదటి అంశం సర్వశక్తిమంతుడైన అల్లాహ్ హక్కులు -- అనగా, ఆయనను ఆరాధించే హక్కు. ఈ అంశంలో హ॥జ్రత్ ముహమ్మద్ పవక్త (సల్లల్లాహు అలైహి

వసల్లం) గారి ఆదర్శము మనకు ఎలా కనిపిస్తుంది?. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం జీవితమంతా దైవ ప్రేమలో మునిగిపోయి ఉండడాన్ని మనం గమనిస్తాము. నిజానికి వారి (స)పై అపారమైన బాధ్యతలు మోపబడినాయి. అనగా, వారు నూతన ధార్మిక చట్టాన్ని వ్యాప్తి చేయుచుండెను, మరియు ప్రజలకు నైతికంగా శిక్షణ ఇచ్చుచుండెను. హజ్రత్ అఖ్దస్ మసీహ్ మవూద్ అలైహిస్సలాతు వస్సలాం ఇలా తెలిపారు. వారు (స) అనాగరికులను మానవులుగా, ఆ తర్వాత నాగరిక మానవులుగా, చివరకు వారిని దైవభక్తి గల ప్రజలుగా మార్చారు.

**(లెక్చర్ సియాల్‌కోట్, రూహాని ఖజాయిన్. సంపుటి 20, పేజీ 206)**

ఇది ఇంతటి భారమైన పని అయినప్పటికీ, ప్రవక్త (స) సర్వశక్తిమంతుడైన అల్లాహ్ హక్కును, అంటే అల్లాహ్‌ను ఆరాధించడాన్ని, ఒక్కసారి కూడా మరచిపోలేదు. ఇది అత్యంత ప్రాముఖ్యమైన విషయం. ఆ సమయంలో, వారు (స) కూడా ఎన్నో కష్టాలను సహించవలసి వచ్చింది. వారు యుద్ధాలలో పాల్గొనవలసి వచ్చింది, మరియు శత్రువులపై దాడి చేయవలసి వచ్చింది. కానీ అల్లాహ్ ఆరాధన హక్కులను నెరవేర్చడంలోప్రవక్త (స) ఎన్నడూ వెనుకాడలేదు.

కావున, మన ముందు ఉన్న ప్రకాశవంతమైన ఉదాహరణ ఇదే. మనం ఎల్లప్పుడూ మన వ్యవహారాలలో సర్వశక్తిమంతుడైన అల్లాహ్‌కు అగ్రస్థానంను కల్పించాలి. ఎందుకంటే మనం ప్రతి విషయంలో సర్వశక్తిమంతుడైన అల్లాహ్‌కు ప్రాధాన్యత ఇస్తే, మన వ్యక్తిగత కష్టాలన్నీ వాటంతట అవే పరిష్కారమవుతాయి. ప్రజలు తరచుగా తమకు ఫలానా సమస్య ఉందని, ఫలానా విధంగా ప్రార్థించామని, తమ వివిధ కష్టాల కోసం ప్రార్థిస్తున్నామని చెబుతుంటారు . కానీ నిజం ఏమిటంటే మనం సర్వశక్తిమంతుడైన దేవుడి హక్కులను నెరవేర్చడం లేదు. అందుకే ప్రజలు వంచనకు గురవుతున్నారు. నాకు హక్కును చెల్లించమని అల్లాహ్ తాలా తెల్పుచున్నాడు.

ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వారి ఆరాధన ప్రమాణం ఏమిటి?

హజ్రత్ ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) అర్థ రాత్రి గడిచిన తరువాత నమాజ్ కోసం లేచేవారు, ఇందుకు సర్వశక్తిమంతుడైన అల్లాహ్ స్వయంగా సాక్ష్యం ఇచ్చాడు. హజ్రత్ ఆయిషా (ర.అ.) ఇలా వివరించారు. ఒక సందర్భంలో, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) రాత్రి పూట నమాజ్ కోసం నిలబడి ఉన్నప్పుడు, "నేను ప్రవక్త (స)ను ఇలా అడిగాను, 'ఓ అల్లాహ్ సందేశవారుడా!, మీరు ఇప్పటికే అల్లాహ్ ప్రీతిపాత్రులను పొందారు. అయినా కూడ మీరు రాత్రిలో ఎక్కువ భాగం అల్లాహ్‌ను ఆరాధిస్తూ, ఆయన ముందు నిరంతరం ఏడుస్తూ, మిమ్మల్ని మీరు ఎందుకు ఇటువంటి కష్టాలకు గురిచేసుకుంటున్నారు?' అందుకు ప్రవక్త (స) ఇలా సమాధానమిచ్చారు,

'ఓ ఆయిషా! అఫలా అకూన అబ్‌దన్ షకూర

**(దిబాచ తఫ్సీరుల్ ఖుర్‌ఆన్ అన్వారుల్ ఉలూమ్, సంపుటి 20, పేజి 382)**

నిజమే, నేను అల్లాహ్‌కు ప్రియమైనవాడిని. అల్లాహ్ తన అనుగ్రహం వలనే నాకు ఈ సాన్నిహిత్య స్థానాన్ని అనుగ్రహించాడు. అలాంటప్పుడు, నాకు సాధ్యమైనంత మేరకు నేను అతనికి కృతజ్ఞత తెల్పడం నా బాధ్యత కాదా? ఎందుకనగా, ఉపకారానికి ప్రతిఫలముగానే కృతజ్ఞత వ్యక్తమవుతుంది.

ఇక్కడ సర్వశక్తిమంతుడైన అల్లాహ్ తన కృప ద్వారా ప్రవక్త (స)ను అంతిమ శాసనకర్త ప్రవక్తగా అవతరింపజేశాడు. వారిపై అంతిమ గ్రంథాన్ని సంపూర్ణం చేశాడు. ధార్మిక చట్టాలను పరిపూర్ణం చేశాడు. అందువలన ప్రవక్త (స) "నేను కృతజ్ఞత తెల్పడకూడదా?" అని అడుగుతూ ఎలా ప్రతిస్పందించారో చూడండి. సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ప్రతి మానవునికి అతని స్థితి గతులను బట్టి ఎన్నో వరాలను ప్రసాదించాడు. కావున, మనం మన ఆరాధన ప్రమాణాలను ఉన్నతీకరించుకోవడానికి కృషి చేయడం అందుకు కృతజ్ఞత హక్కు అనబడుతుంది. కొన్నిసార్లు ప్రజలు, ముఖ్యంగా యువత, వచ్చి ఇలా అడుగుతారు, "మేము సర్వశక్తిమంతుడైన అల్లాహ్‌ను ఎలా ఆరాధించవలెను? సర్వశక్తిమంతుడైన అల్లాహ్‌కు మా ఆరాధనల అవసరం ఏమి ఉన్నది?" ఇలాంటి ప్రశ్నలు ఉత్పన్నమవుతుంటాయి. నేటి ఆధునికత అనే వాతావరణ ప్రభావానికి లోనైన యువత ఈ ప్రశ్న అడుగుతుంది.

దానికి సమాధానం: సర్వశక్తిమంతుడైన అల్లాహ్‌కు మన ఆరాధన అవసరం లేదు. కానీ,అల్లాహ్ మీకు ప్రసాదించిన ఆధ్యాత్మిక మరియు ప్రాపంచిక వరాలకు బదులుగా, మీరు ఆయనకు కృతజ్ఞత తెలిపే హక్కును నెరవేర్చాలని మరియు ఆయనకు కృతజ్ఞతగల సేవకులుగా మారాలని ఆయన కోరడం లేదా?

అదేవిధంగా, ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం జీవిత చరిత్రలలో ఒక సంధర్భము మనకు కనిపిస్తుంది. ప్రవక్త (స) అల్లాహ్ సూక్తుల పారాయణంను విన్నప్పుడు, ముఖ్యంగా తనకు అప్పగించబడిన గొప్ప విధులు మరియు బాధ్యతలను నొక్కి చెప్పే సూక్తులను విన్నప్పుడు, వారి కళ్ళు కన్నీటితో నిండిపోయేవి.

ఈ క్రమంలోనే ఒక కథనము ఇలా గలదు. ఒక రోజు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) హజ్రత్ అబ్దుల్లా బిన్ మసూద్ రజియల్లాహ్ అన్‌హును పవిత్ర ఖురాన్‌లోని కొంత భాగాన్ని పఠించమని కోరారు. అందుకు హజ్రత్ అబ్దుల్లా ఇలా తెలిపారు. నేను ఇలా విన్నవించుకున్నాను. "ఓ అల్లాహ్ ప్రవక్త! పవిత్ర ఖురాన్ మీపై నేరుగా అవతరించింది. నేను మీకు దానిలోని ఒక భాగాన్ని ఎలా పారాయణం చేసి వినిపించగలను?". ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా అన్నారు, "ఇతరులు పవిత్ర ఖురాన్‌ను పారాయణం చేస్తుండగా దానిని వినడాన్ని నేను ఇష్టపడుతాను." దీనిపై, హజ్రత్ అబ్దుల్లా బిన్ మసూద్ రజి ఇలా తెలిపారు. అప్పుడు నేను నిస్సా అధ్యాయంను పఠించడం ప్రారంభించాను. పారాయణం చేస్తు, నేను ఈ సూక్తిని చేరుకున్నాను: ఫకైఫ ఇజా జీయినా మిన్ కుల్లి ఉమ్మతిన్ బిషహీదిన్ వ్వజియినా బిక అలా హావులాయి షహీద (నిషా :42) అనగా "మేము ప్రతి జాతి నుండి వారి ప్రవక్తను బయటకు తీసుకువచ్చి, అతని ప్రజల ముందు అతనిని నిలబెట్టి, ఆ జాతిపై తీర్పు చెప్పినప్పుడు, మరియు మేము కూడా మీ జాతి ముందు మిమ్మల్ని నిలబెట్టి, వారి లెక్కలు తీసుకుంటున్నప్పుడు పరిస్థితి ఎలా ఉంటుంది". అప్పుడు ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం "చాలు, చాలు" అన్నారు. ఆ సహచరుడు ఇలా తెలిపాడు. "నేను ప్రవక్త (స) వైపు చూశాను, వారి కన్నుల నుండి కన్నీళ్లు కారుతున్నాయి." వారిపై అంతటి దైవభీతి ఆవరించింది. మరియు ఆ క్షణంలో, నా జాతి ప్రజలు దైవాగ్రహానికి గురిఅయ్యే పనులు ఎక్కడ చేస్తారో, ఎక్కడ నేనే వారికి వ్యతిరేకముగా సాక్ష్యం చెప్పవలసి వస్తుందో అని తమ జాతి ప్రజల పట్ల ఆందోళన చెంది ఉంటారు. కావున దీని నుండి ఒక విషయం కూడా స్పష్టమవుతోంది: దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) మనకు అనుకూలంగా సాక్ష్యం చెప్పే అనేక విషయాలు ఉన్నప్పటికీ, అదే సమయంలో, ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఎక్కడ మనకు వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పవలసి వస్తుందో అనే భయం మనకు ఉండాలి.

ఎక్కడ మన పాపాలను బట్టబయలు చేసే సత్యాలు మన నుండి వెలువడుతాయో, ఎక్కడ మనం సర్వశక్తిమంతుడైన అల్లాహ్ యొక్క శిక్షకు అర్హులమవుతామేమోననే భయం మనకు ఉండాలి.

అందువల్ల, ఇది మనం తీవ్రంగా భయపడవలసిన విషయం ఇది. మనం కూడ మన ఆరాధన హక్కులను నెరవేర్చాలి, మరియు హజ్రత్ ముహమ్మద్ సల్లాహు అలైహి వసల్లం మనకు కలిగి ఉండమని ఉపదేశించిన మరియు సర్వశక్తిమంతుడైన అల్లాహ్ పవిత్ర ఖురాన్‌లో మనకు ఆజ్ఞాపించినటువంటి ప్రేమను మనం సర్వశక్తిమంతుడైన అల్లాహ్ పట్ల కలిగి ఉండాలి.

నమాజ్ చదివే విషయాన్ని ఉదాహరణగా తీసుకోండి: దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం నమాజ్ పట్ల ఎంత శ్రద్ధ వహించేవారంటే, తీవ్రమైన అనారోగ్యంతో ఉన్నప్పుడు, పడుకోని నమాజ్ చేసే అనుమతి ఉన్న చివరి రోజులలో కూడ ప్రవక్త (స) ఇతరుల సహాయం తీసుకుని మసీదుకు వెళ్ళినట్లు చరిత్రలో పొందు పర్చబడింది. ఒక రోజు, ప్రవక్త (స) వెళ్ళలేకపోయారు. కావున హజ్రత్ అబూబకర్ రజిను నమాజ్ చదివించమని ఆదేశించారు. ఆ సమయంలో, ఆరోగ్యం కొంత మెరుగు పడినట్లు ప్రవక్త (స)కు అనిపించినది. వెంటనే ఇద్దరు వ్యక్తుల సహాయం తీసుకుని, మసీదు వైపు బయలుదేరారు. హజ్రత్ ఆయిషా రజియల్లాహు తాలా అన్‌హా ఇలా తెలిపారు. ఆ సమయంలో కూడ ప్రవక్త (స) రెండు పాదాలు నేలపై ఈడ్చుకుంటూ వెళ్ళుతున్న పరిస్థితి కనిపించింది.

**(దిబాచా తఫ్సీరుల్ ఖురాన్, అన్వారుల్-ఉలూమ్, సంపుటి 20, పేజీ 383)**

కానీ సామూహిక నమాజ్ యొక్క ప్రాముఖ్యతే ప్రవక్త (స) ప్రధాన లక్ష్యం. ముస్లింలకు దాని ప్రాముఖ్యతను చూపించాలనుకున్నారు. అందుకే వారు ఆ కష్టాన్ని భరించారు. పాదాలు ఈడ్చుకుంటూ పోతున్నా కూడ వారు మస్జిద్‌కు చేరుకున్నారు. తన అనారోగ్యం గురించి ఏమాత్రం పట్టించుకోలేదు. సర్వశక్తిమంతుడైన అల్లాహ్ పట్ల ప్రవక్త (స)కు ఇంతటి ప్రేమ ఉండేది. మరియు ఈ విషయంలో వారు (స) ప్రజలకు నైతికంగా కూడా శిక్షణ ఇచ్చేవారు. ఒకవైపు, నమాజులను చదవడంపై వారు (స) శ్రద్ధ చూపేవారు, మరోవైపు, ప్రజల హృదయాలలో సర్వశక్తిమంతుడైన అల్లాహ్ యొక్క గొప్పతనాన్ని, వైభవాన్ని వారు(స) ఎలా నింపేవారో, ఎలా శిక్షణ ఇచ్చారో గమనించవచ్చు.

ఇతరుల దృష్టిని ఆకర్షించడానికి చప్పట్లు కొట్టడం అరబ్బులలో ఒక ఆచారంగా ఉండేది. ఆ కాలంలో ఈ పద్ధతి సర్వసాధారణంగా ఉండేది. కానీ హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఈ ఆచారాన్ని రద్దు చేసి, దాని స్థానంలో అల్లాహ్ స్మరణ ఉండాలని చెప్పారు.

ఒక కథనములో ఈ విషయం ఇలా గలదు. ఒకసారి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఒక పనిలో నిమగ్నమై ఉండగా, నమాజు సమయం ఆసన్నమైందని. ప్రవక్త (స) "అబూ బకర్ రజి ను నమాజు చదువించమని చెప్పు" అని అన్నారు. ఇంతలో, వారు ఆ పనిని పూర్తి చేసి వెంటనే మసీదు వైపు బయలుదేరారు. వారు

మసీదుకు చేరుకునే సరికి, హజ్రత్ అబూ బకర్ రజి నమాజు చదువించుతున్నారు. వారు (స) మసీదుకు వచ్చారని ప్రజలకు తెలిసినప్పుడు, నమాజు చేస్తున్నవారు ఆందోళనతో చప్పట్లు కొట్టడం ప్రారంభించారు. ఒకవైపు, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) రాకతో తమ హృదయాలు అత్యంత ఆనందంతో నిండిపోయాయని చూపించడం దీని ఉద్దేశ్యం కాగా, మరోవైపు, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) రాకతో, ఇప్పుడు మీ నమాజ్ నేతృత్వం ముగిసిందని హజ్రత్ అబూ బకర్ రజి దృష్టికి తీసుకురావాలని వారు కోరుకున్నారు. హజ్రత్ అబూ బకర్ రజి వెనక్కి జరిగి, ఇమామ్ స్థానాన్ని దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)కు వదిలిపెట్టారు. నమాజ్ అనంతరం, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా అన్నారు, "అబూ బకర్ రజి, నేను నిన్ను నమాజ్ చదువించమని ఆదేశించినప్పుడు, ఎందుకు వెనక్కి జరిగావు?" హజ్రత్ అబూ బకర్ రజి ఎంతో నిష్కపటంగా ఇలా అన్నారు, "అల్లాహ్ యొక్క సందేశవారుని సమక్షంలో, అబూ ఖుహాఫా కుమారునికి నమాజ్ చదువించడానికి ఏ హోదా ఉంది?" అప్పుడు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) సహచరుల వైపు తిరిగి ఇలా అన్నారు, "మీరు చప్పట్లు కొట్టడంలో మీ ఉద్దేశ్యం ఏమిటి? అల్లాహ్ స్మరణలో చప్పట్లు కొట్టడం తగదు. నమాజు సమయంలో ఇతరుల దృష్టిని ఆకర్షించవలసిన విషయం ఏదైనా వచ్చినప్పుడు, చప్పట్లు కొట్టడానికి బదులుగా, అల్లాహ్ నామాన్ని బిగ్గరగా స్మరించాలి. 'సుభానల్లాహ్' అల్లాహ్ పవిత్రుడు అని పలకాలి. మీరు ఇలా చేసినప్పుడు, ఇతరుల దృష్టి దానంతట అదే ఆ విషయం వైపు మళ్లుతుంది."

అదేవిధంగా, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) అనవసరమైన మరియు అధికమైన కష్టాలను, శ్రమలను భరిస్తూ చేసే నమాజ్‌లను ఇష్టపడలేదు. ఎన్నో ఆరాధనల గురించి ప్రస్తావించినప్పటికీ, ఒకరి ఆచరణలో ఎటువంటి అనవసరమైన కష్టం లేదా శ్రమ ఉండకూడదని వారు అన్నారు. ఒకసారి, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఒక ఇంటిలోకి వెళ్ళినప్పుడు, రెండు స్తంభాల మధ్య ఒక తాడు వేలాడుతూ ఉండటం చూశారు. వారు, "ఈ తాడు ఎందుకు కట్టారు?" అని అడిగారు. అప్పుడు అక్కడి ప్రజలు, "ఇది హజ్రత్ జైనబ్ రజి గారి తాడు. ఆమె నమాజు చేసేటప్పుడు అలసిపోయినప్పుడు, ఈ తాడును పట్టుకుని ఆసరా తీసుకుంటారు," అని ప్రవక్త (స)కు తెలియజేశారు. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా అన్నారు, "ఇలా చేయకూడదు. ఈ తాడును విప్పండి. ప్రతి వ్యక్తి తన హృదయం ఆరాధన వైపు మొగ్గు చూపినంత సేపు మాత్రమే ఆరాధించాలి. వారు అలసిపోయినప్పుడు, కూర్చుండిపోవాలి. ఈ విధమైన శ్రమతో కూడిన ఆరాధన ఎటువంటి ప్రయోజనాన్ని తీసుకురాలేదు."

**(దిబాచా తఫ్సీరుల్ ఖురాన్, అన్వర్-ఉల్-ఉలూమ్, సంపుటి 20, పేజీ 384)**

ఒకవైపు, ప్రవక్త (స) నైతిక శిక్షణ ప్రభావంతో, మహిళా సహచరులు, అలాగే వారి ఇంటివారు మరియు కుటుంబ సభ్యులు కూడా ఆరాధన పట్ల గొప్ప కోరికను కలిగి ఉండేవారని, మరియు కష్టాలకు సైతం లోనయ్యేవారని ఇది చూపిస్తుంది. మరోవైపు, వారు (స) కష్టాలను విధించాల్సిన అవసరం లేదని, బదులుగా ఆరాధనను సులభంగా చేయాలని కూడా పేర్కొన్నారు. అయితే, ఈ రోజుల్లో కొందరు చెప్పడం మొదలుపెట్టినట్లుగా దీని అర్థం కాదని నేను ప్రజలకు స్పష్టం చేయాలి. అంటే, కష్టాలను విధించాల్సిన అవసరం లేదు కాబట్టి, కేవలం ఒక బాధ్యతను నెరవేర్చడం కోసం, అదొక భారంలా భావించి, తొందరగా నమాజు చేసి ముగించేయాలని కాదు. వాస్తవానికి, ఇది ఈ మార్గనిర్దేశం యొక్క నిజమైన అర్థానికి పూర్తి విరుద్ధం, దీనివల్ల ప్రజలు దీనిని వ్యక్తిగత సౌకర్యం కోసం అని అన్వయించడం మొదలుపెట్టారు.

ఈ రోజుల్లో, ఆరాధనకు వచ్చే వారిలో కొందరు కొన్ని నిమిషాల్లోనే నమాజు చేసి ముగించేస్తున్నారు; లేదా వారు ఇంట్లో ప్రార్థన చేస్తే, కొన్ని నిమిషాల్లోనే పూర్తి చేస్తున్నారు. చాలా సందర్భాలలో, నమాజు ఎలా చేయాలని ప్రజలు నన్ను అడుగుతారు కూడా. నమాజును శ్రద్ధతో మరియు తగిన రీతిలో చేయాలి.

ఈ విషయంలో, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) యొక్క ఒక హదీసులో, వారు ఒక సహచరునికి నమాజును మూడు లేదా నాలుగు సార్లు తిరిగి చేయమని ఆదేశించారు. ఆ సహచరుడు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వారి సభకు ఆలస్యంగా వచ్చారు. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) నమాజు చేసిన తర్వాత సభలో కూర్చుని ఉన్నారు. సామూహిక నమాజు ముగిసింది, మరియు సభ జరుగుతోంది. ఆ సహచరుడు నమాజు చేసి వారి వద్దకు తిరిగి వచ్చిన ప్రతిసారీ, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) "వెనక్కి వెళ్లి మళ్ళీ నమాజు చేయి" అని చెప్పేవారు. అతను నమాజు చేసి తిరిగి వచ్చేవాడు, మరియు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) మళ్ళీ "వెనక్కి వెళ్లి మళ్ళీ నమాజు చేయి" అని చెప్పేవారు. ఈ విధంగా, వారు అతనికి నమాజును మూడు లేదా నాలుగు సార్లు చేయమని ఆదేశించారు. నమాజు చేయడానికి ఇంతకంటే మంచి పద్ధతి తనకు తెలియదని ఆ సహచరుడు విన్నవించుకుని, దానిని ఎలా చేయాలో వివరించమని అడిగినప్పుడు, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా అన్నారు: "ప్రశాంతంగా మరియు నిబ్బరంగా నమాజు చేయి; అల్లాహ్‌ను స్మరించు, దురూద్ పఠించు, మరియు ఆయన ఏకత్వాన్ని స్మరించుకొని ఆయనను స్తుతించు. వంగడం మరియు సాష్టాంగ నమస్కారం కూడా సరిగ్గా చేయాలి."

**(సహీ-బుఖారీ, కితాబ్ అల్-అధాన్, హదీస్ 793)**

అందువల్ల, ఈ విషయాన్ని కూడా గుర్తుంచుకోండి. నమాజును సునాయాసంగా చేయాలని ఒక హదీస్ ఉంది గనుక, దానిని తొందరగా చేయడం అని సునాయాసంగా చేయడం కాదు. నిద్ర వస్తే, కేవలం కొన్ని నిమిషాల్లోనే తొందరగా నమాజు చేయాలని కూడా దీని అర్థం కాదు. నిజానికి, మత్తులో ఉన్నప్పుడు నమాజు చేయడం ఏ సందర్భంలోనైనా నిషేధం. ఇది అనుమతించబడదు. దానికి బదులుగా, నమాజు చేసేటప్పుడు, దాని హక్కును నెరవేర్చాలి. ఇది కూడా గట్టిగా ఆజ్ఞాపించబడింది.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) షిర్క్‌ను (అల్లాహ్‌కు భాగస్వాములను కల్పించడం) ఎంతగా ద్వేషించే వారంటే, వారు (స) మరణ సమయంలో, చివరి క్షణాల్లో బాధపడుతున్నప్పుడు కూడా, కొన్నిసార్లు కుడివైపుకు, మరికొన్నిసార్లు ఎడమవైపుకు తిరిగి పడుకుని, పదేపదే ఇలా అనేవారు: "తమ ప్రవక్తల సమాధులను ఆరాధనా స్థలాలుగా మార్చిన ఆ యూదులను, క్రైస్తవులను అల్లాహ్ శపించుగాక!"

**(దిబాచా తఫ్సీరుల్ ఖురాన్, అన్వారుల్‌ఉలూమ్, సంపుటి 20, పుట 385)**

అంటే, వారు తమ ప్రవక్తల సమాధుల ముందు సాష్టాంగ నమస్కారం చేసి, వారిని ప్రార్థించేవారు. దీని ద్వారా ప్రవక్త (స) చెప్పదలిచినది ఏమిటంటే, నా తర్వాత నా సమాజం వారు అటువంటి చర్యకు పాల్పడితే, దానివల్ల తాము నా ప్రార్థనలకు అర్హులమవుతామని వారు భావించకూడదు; పైగా, నేను వారితో పూర్తిగా సంబంధం లేకుండా పోతాను. ఇది వరకే చెప్పినట్లుగా, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ప్రవక్తల నుండి సాక్ష్యం స్వీకరిస్తాడు.

మదీనాలో, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) యొక్క సమాధి వద్ద అధికారులు కఠినమైన ఆంక్షలు విధించడాన్ని గమనించవచ్చు; ఈ కారణంగానే, అక్కడ ఎవరినీ సాష్టాంగ నమస్కారం చేయడానికి గానీ, కనీసం దగ్గరకు వెళ్ళడానికి గానీ అనుమతించరు. అయితే, అనేక ముస్లిం దేశాలలో, పుణ్యాత్ములు మరియు మత సమూహాల నాయకుల సమాధుల వద్ద సాష్టాంగ నమస్కారాలు చేస్తారు, మరియు ఆ పుణ్యాత్ములకు మొక్కులు, ప్రార్థనలు సమర్పిస్తారు. ఈ ఆచారం షిర్క్ (బహుదైవారాధన), దీనినే దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) నిషేధించారు, మరియు దీనిని వారు తమ వ్యక్తిగత విషయంలో కూడా నిషేధించారు. అలాంటప్పుడు, ఏ ఇతర పుణ్యాత్మునికి గానీ, మత నాయకునికి గానీ, లేదా పెద్దాయనకు గానీ తన సమాధి వద్ద సాష్టాంగ నమస్కారం చేయడానికి ఏ హక్కు ఉంది? . హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాంను స్వీకరించడం ద్వారా, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ దయవల్ల మనం ఈ ఆచారాల నుండి మనల్ని మనం కాపాడుకున్నాము; అయినప్పటికీ, మనం సరైన ఆరాధన ప్రమాణాలను చేరుకోవడానికి ఇంకా కృషి చేయాలి. ఇతరులలో, అంటే మిగిలిన ముస్లింలలో, ఈ ఆచారం విస్తృతంగా వ్యాపించి ఉంది. సర్వశక్తిమంతుడైన అల్లాహ్ వారిపై కూడా కరుణ చూపి, వారికి వివేకాన్ని మరియు అవగాహనను ప్రసాదించుగాక! తద్వారా వారు ఈ షిర్క్ (బహుదైవారాధన) నుండి విరమించుకోగలరు.

సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ముందు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) యొక్క వినయం ఎంత గొప్పదంటే, ప్రజలు వారితో ఇలా అన్నప్పుడు, "ఓ అల్లాహ్ యొక్క సందేశవారుడా! మీ కర్మల బలం ద్వారా మీరు తప్పకుండా అల్లాహ్ యొక్క అనుగ్రహాన్ని పొందుతారు, ఎందుకంటే సర్వశక్తిమంతుడైన అల్లాహ్ మీకు ఒక ధృవీకరణ పత్రాన్ని ఇచ్చాడు, మీ నైతికతను ప్రశంసించాడు మరియు ముస్లింలకు మీ ఆదర్శాన్ని ఒక ప్రవర్తనా ప్రమాణంగా నెలకొల్పాడు. దీని అర్థం మీ కర్మలు అల్లాహ్ మిమ్మల్ని క్షమించే విధంగా ఉన్నాయి, లేదా ఇప్పటికే క్షమించాడు." దానికి వారు (స) ఇలా సమాధానమిచ్చారు, "కాదు, కాదు; నేను కూడా కేవలం అల్లాహ్ యొక్క అనుగ్రహం వలనే క్షమించబడతాను."

దీనికి అనుగుణంగా, హజ్రత్ అబూ హురైరహ్ (రజియల్లాహు అన్హు) ఇలా వివరిస్తారు: ఒక రోజు అల్లాహ్ యొక్క సందేశవారుడు (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా అనడం నేను విన్నాను: "ఏ వ్యక్తి కూడా కేవలం తన కర్మల పుణ్యమా అని స్వర్గంలో ప్రవేశించడు." నేను ఇలా విన్నవించుకున్నాను, "ఓ అల్లాహ్ ప్రవక్తా! మీరు కూడా మీ కర్మల ద్వారా స్వర్గంలో ప్రవేశించలేరా?" దానికి వారు (స) ఇలా సమాధానమిచ్చారు, "నేను కూడా నా కర్మల బలంతో స్వర్గంలో ప్రవేశించలేను; దానికి బదులుగా, నేను అల్లాహ్ యొక్క అనుగ్రహం మరియు కరుణ అనే వస్త్రంతో

కప్పబడి ఉంటేనే అది సాధ్యమవుతుంది." ఇది సహీహ్ అల్-బుఖారీ నుండి ఉల్లేఖించబడినది.

**(దిబాచా తఫ్సీరుల్-ఖురాన్, అన్వారుల్ ఉలూమ్, సంపుటి 20, పుటలు 386-387) (సహీ-బుఖారీ, కితాబ్ అల్-మర్జా...., హదీసు 5673)**

ఆ తర్వాత, ప్రవక్త (స) మాకు ఇలా హితవు పలికారు: "మీ కర్మలు సదాచారానికి అనుగుణంగా ఉండేలా చూసుకోండి, అలాగే సర్వశక్తిమంతుడైన అల్లాహ్‌కు మిమ్మల్ని మరింత దగ్గర చేసే మార్గాలను అన్వేషించండి." వారు (స) ఇంకా ఇలా అన్నారు: "మీలో ఎవరూ ఎప్పుడూ మరణాన్ని కోరుకోకూడదు. ఒకవేళ ఆ వ్యక్తి సదాచారి అయితే, జీవించి ఉండటం ద్వారా అతను తన సదాచరణను మరింత వృద్ధి చేసుకుంటాడు; ఒకవేళ అతను పాపి అయితే, జీవించి ఉండటం ద్వారా అతనికి పశ్చాత్తాపపడి, తన పాపాలకు క్షమాపణ కోరే అవకాశం లభిస్తుంది."

**(సహీ-బుఖారీ, కితాబ్ అత్-తమన్నీ, ....హదీసు 7235)**

ఇది మనం తప్పక గుర్తుంచుకోవాల్సిన అత్యంత ముఖ్యమైన మార్గదర్శకత్వం: ఎవరూ ఎప్పుడూ మరణాన్ని ఆశించకూడదు. దీనికి గల కారణాన్ని ప్రవక్త (స) ఇలా వివరించారు: ఎవరైనా కష్టాల వల్ల, ఎందుకంటే సాధారణంగా ఏదో ఒక కష్టం లేదా బాధ వల్లే మనిషి మరణాన్ని కోరుకుంటాడు. మరణాన్ని ఆశిస్తే, మరియు ఆ వ్యక్తి వద్ద కొన్ని సత్కర్మలు ఉంటే, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ వారికి మరిన్ని సత్కర్మలు చేసే సామర్థ్యాన్ని ప్రసాదిస్తాడు. అంతేకాక పరలోకంలో వారికి మరింత మెరుగైన ఏర్పాట్లు చేస్తూ, వారి పాపాలను క్షమిస్తాడు. ఒకవేళ వారు పాపాలు చేసి ఉంటే, వారి దృష్టి ఆ పశ్చాత్తాపం మరియు క్షమాపణ వైపు మళ్ళినప్పుడు, వారికి ఆ అవకాశం లభిస్తుంది; తద్వారా వారు పాపాల నుండి విముక్తులై, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ సామీప్యాన్ని పొందుతారు. ఇక వారి మరణ సమయం ఆసన్నమైనప్పుడు, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ వారి పాపాలకు క్షమాపణ లభించే మార్గాలను కూడా కల్పించవచ్చు.

వారు స్వయంగా పాటించిన ఆరాధన ప్రమాణాలను మనం ఇప్పటికే గమనించాము; అయితే, వారు (స) ఇతరుల దృష్టిని కూడా నిరంతరం ఆ ఆరాధన వైపు మళ్ళించేవారు.

ఒక హదీసులో ఇలా ప్రస్తావించబడింది: ఒక సందర్భంలో, రాత్రి వేళ, ప్రవక్త (స) తన అల్లుడు హజ్రత్ అలీ (ర.అ.) మరియు తన కుమార్తె హజ్రత్ ఫాతిమా (ర.అ.) నివాసానికి వెళ్ళి, వారు 'తహజ్జుద్' నమాజును చదువుతున్నారా? అని అడిగారు. అప్పుడు హజ్రత్ అలీ (ర.అ.) ఇలా విన్నవించుకున్నారు: "ఓ అల్లాహ్ ప్రవక్త (స.అ.వ.)! మేము దానిని ఆచరించడానికి ప్రయత్నిస్తూనే ఉంటాము, కానీ సర్వశక్తిమంతుడైన దేవుని సంకల్పం ప్రకారం, కొన్నిసార్లు మా కళ్ళు నిద్రతో మూసుకుపోయినప్పుడు, తహజ్జుద్ నమాజు మాకు తప్పిపోతుంది." దీనిపై ప్రవక్త (స) "తహజ్జుద్ నమాజును చదవండి," అని పలికి, ఆపై లేచి తమ ఇంటి వైపు బయలుదేరారు. తిరిగి వెళ్తూ, వారు ఈ వాక్యాలను పదే పదే పఠించారు: వకానల్ ఇన్‌సాను అక్‌సర షైఇన్ జదలా అనగా మానవుడు తన తప్పిదాలను స్వీకరించుటకు ఎక్కువగా భయపడుతుంటాడు. అందుకు అనేక రకాల సాకులను చూపుతూ తన తప్పును కప్పి పుచ్చుకోవడానికి ప్రయత్నిస్తాడు.

అందువల్ల, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వారికి నేరుగా సలహా ఇచ్చి, విషయాన్ని వివరించారు. తిరిగి వెళ్తున్నప్పుడు కూడా, ఇతరులు కూడా దాని అర్థాన్ని హజ్రత్ అలీరాకు తెలియజేయాలనే ఉద్దేశ్యంతో వారు ఈ విషయాన్ని పదేపదే నొక్కి చెప్పారు. దీని ద్వారా వారు ఒక పాఠాన్ని బోధించారు: హజ్రత్ అలీ రజి దానిని సర్వశక్తిమంతుడైన దేవునికి ఆపాదించి, "సర్వశక్తిమంతుడైన దేవుడు తలచుకుంటే, మేము మేల్కొని ఉండేవాళ్ళం; లేకపోతే, మేము నిద్రలోనే ఉండి పోయాము" అని చెప్పడానికి బదులుగా, "కొన్నిసార్లు మేము పొరపాటు చేస్తాము మరియు మేల్కొనము" అని చెప్పి ఉండాల్సింది. ఒకరు తమ సొంత లోపాలను సర్వశక్తిమంతుడైన దేవునికి ఎందుకు ఆపాదించకూడదో వివరించడమే ప్రవక్త (స) ఉద్దేశ్యం. ఇప్పటికే చెప్పినట్లుగా, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఆరాధనలో ఎలాంటి నటనను గానీ లేదా అనవసరమైన కష్టాన్ని గానీ ఆమోదించలేదు. ఒక సందర్భంలో, ఆయన ఇంట్లో తాళ్లు వేలాడుతూ ఉండటం చూసి, వాటిని తీసివేయమని ఆదేశించారు.

వారి సాంప్రదాయం ఏమిటంటే, సర్వశక్తిమంతుడైన దేవుడు మనిషికి ప్రసాదించిన శక్తులను సరిగ్గా ఉపయోగించుకోవాలి, మరియు ఇదే నిజమైన ఆరాధన అవుతుంది.

కళ్ళు ఉన్నప్పటికీ వాటిని మూసుకోవడం, లేదా ఉద్దేశపూర్వకంగా వాటిని పనిచేయకుండా చేయడం ప్రార్థన కాదు; పైగా, అది అగౌరవ చర్య. అయితే, ఈ ఇంద్రియాలను దుర్వినియోగం చేయడం నిస్సందేహంగా పాపం. ఈ ప్రస్తుత కాలంలో, ప్రజలను తమ వైపుకు ఆకర్షించే అనేక ఆకర్షణలు, కోరికలు ప్రపంచంలో ఉన్నాయని మనం గమనించవచ్చు. ఒకవేళ ఎవరైనా వాటి వైపు మొగ్గు చూపి, టెలివిజన్‌లో అనుచితమైన కార్యక్రమాలను చూసినా, ఇంటర్నెట్‌లో అనుచితమైన విషయాలను వీక్షించినా, లేదా అసభ్యకరమైన దేనినైనా చూసినా, అది పాపమవుతుంది. అటువంటి పాపం నుండి తమను తాము కాపాడుకోవడమే అత్యంత ముఖ్యమైన విషయమని, ఈ నిగ్రహమే ప్రతిఫలానికి మూలమవుతుందని ప్రవక్త (స) బోధించారు.

అదేవిధంగా, చెవులు మూసుకోవడం పుణ్యం కాదు. సర్వశక్తిమంతుడైన దేవుడు ఒక ఇంద్రియాన్ని ప్రసాదించాడు; అలాంటప్పుడు దానిని ఎందుకు అణచివేయాలి? పైగా, ఇది కూడా అగౌరవమే, ఎందుకంటే సర్వశక్తిమంతుడైన దేవుడు ప్రసాదించిన వరాన్ని మనం వృథా చేస్తున్నాము. అవును, చాడీలు వినడం, ఇతరుల గురించి చెడుగా మాట్లాడటం పాపమే. చాలామంది చాడీలు చెప్పడమే కాకుండా, ఇతరులు చెప్పేది వింటారు; ఇతరుల గురించి అసత్యమైన, హానికరమైన విషయాలు విని, వారి బలహీనతలు, తప్పుల గురించి వింటూ నవ్వుతూ ఆనందం కూడా పొందుతారు. ఇటువంటి ప్రవర్తన తప్పు మరియు పాపభరితమైనది. ఈ విషయంలో, ఇటువంటి చర్యలకు దూరంగా ఉండాలని ప్రవక్త (స)ఆదేశించారు.

నైతిక శ్రేష్ఠత అంటే ఒకరి సహజ సామర్థ్యాలను సక్రమంగా ఉపయోగించుకోవడమే అని దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) పేర్కొన్నారు. ఈ సామర్థ్యాలను అణచివేయడం అవివేకం; వాటిని చట్టవిరుద్ధమైన పనులలో ఉపయోగించడం అనైతికత; మరియు వాటిని సరిగ్గా, న్యాయబద్ధంగా ఉపయోగించడం పుణ్యం. ఇది ప్రవక్త (స) బోధనల యొక్క సంక్షిప్త సారాంశం, మరియు నిజానికి, ఇదే దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) జీవిత సారం. ఈ కారణంగానే సర్వశక్తిమంతుడైన అల్లాహ్, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) జీవితాన్ని ఒక పరిపూర్ణ ఆదర్శంగా స్వీకరించమని మనకు ఆజ్ఞాపించాడు.

ప్రవక్త (స) ఆచరణలను గూర్చి హజ్రత్ ఆయిషా రజి ఒక చోట ఇలా పేర్కొన్నారు: అల్లాహ్ యొక్క సందేశవారుని (సల్లల్లాహు అలైహి వసల్లం) జీవితంలో, వారికి రెండు మార్గాలు ఎదురైనప్పుడు, పాప ఛాయలు లేనంత వరకు సులభమైన మార్గాన్ని ఎంచుకునేవారు. వారు ఆ రెండింటిలో సులభమైన దానినే ఎంచుకోని సందర్భం ఎప్పుడూ రాలేదు. అందువల్ల, ఒకటి సులభమైనది, మరొకటి కష్టమైనది అనే రెండు మార్గాలు అందుబాటులో ఉన్నప్పుడు, వారు ఎల్లప్పుడూ సులభమైన మార్గాన్నే అనుసరించడానికి ప్రయత్నించేవారు, ఎందుకంటే సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ప్రజలను అనవసరమైన కష్టాలకు గురిచేయాలని కోరుకోడు. అయితే, సులభమైన మార్గం పాపానికి దారితీయవచ్చనే స్వల్ప అనుమానం కలిగినా, వారు దానిని పూర్తిగా విడిచిపెట్టి, పొడవైన లేదా మరింత కష్టమైన మార్గాన్ని అనుసరించేవారు. నిజానికి, అతి స్వల్పమైన సందేహం కూడా వారిని మరే ఇతర మానవుడూ చేయనంతగా దాని నుండి దూరం చేసేదని చెప్పవచ్చు.

ప్రపంచంలో కొన్నిసార్లు, ప్రజలు ఇతరులను మోసగించడానికి మరియు తాము గొప్ప ఆధ్యాత్మిక పోరాటాలు చేశామని చెప్పుకుంటూ, తమలో ఉన్న అసాధారణ గుణాలను ప్రదర్శించడానికి ఉద్దేశపూర్వకంగా కష్టాలను కొని తెచ్చుకోవడం గమనించవచ్చు. ఆధ్యాత్మిక నాయకులమని చెప్పుకునే వారు కూడా ఇలాంటి కథలనే చెబుతారు. అయితే, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) సుఖ మార్గాన్ని కోరుకున్నారు, ఎందుకంటే అలాంటి ఆడంబరాలలో మునిగి పోయేవారు కేవలం తమ గొప్పతనాన్ని చాటుకోవడానికి లేదా ప్రశంసలు పొందడానికి మాత్రమే కష్టాలను కొనితెచ్చుకుంటారు. వారు సర్వశక్తిమంతుడైన దేవుని కొరకు పనిచేయరు, ఎందుకంటే వారి బాధల వలన సర్వశక్తిమంతుడైన దేవునికి ఎలాంటి ప్రయోజనం ఉండదు, దాని నుండి వారు ఎలాంటి ప్రతిఫలాన్ని పొందరు. ఇలాంటి పనులు ప్రజలను మోసగించడానికి చేయబడతాయి, మరియు ఒక వ్యక్తి మోసం చేయాలనే ఉద్దేశంతో పనిచేసినప్పుడు, వారి ఈ దురుద్దేశం కారణంగా సర్వశక్తిమంతుడైన దేవుడు ప్రతిఫలానికి బదులుగా పాపాన్ని ప్రసాదిస్తాడు.

కొందరు తమ తప్పులను దాచుకోవడానికి, తమ బలహీనతలపై ఏదో ఒక విధంగా ముసుగు వేయడానికి ప్రయత్నిస్తూ, తాము గొప్ప గుణాలని, వాటికోసం పడిన కష్టాలని గట్టిగా చాటుకుంటూ అతిశయోక్తి ప్రదర్శనలలో నిమగ్నమవుతారు. ఇటువంటి ప్రవర్తన గురించి సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ఇలా ప్రకటిస్తున్నాడు: ఈ పనులు ఒకరిని ఆయనకు దగ్గర చేయవు; పైగా, అవి ఆయన ఆగ్రహానికి కారణమవుతాయి, ఎందుకంటే వారి ఉద్దేశం స్వచ్ఛమైనది కాదు. ప్రజల అభిమానాన్ని పొందాలనే ఆశతో, బహిరంగ ప్రదర్శన ఇతరులను తమ వైపు మొగ్గు చూపేలా చేస్తుందనే ఆశతో ఇటువంటి పనులు చేస్తారు. ఈ విధంగా, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) తమ ఆచరణాత్మక ఉదాహరణ మరియు మాటల ద్వారా చేసిన హెచ్చరికల ద్వారా ఈ సూక్ష్మమైన ఇంకా లోతైన పాఠాలను బోధించారు.

తోటి మానవులతో ప్రవక్త (స) సంబంధాల విషయానికొస్తే, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) తమ సొంత ఇంట్లో మరియు తమ భార్యలతో వారు వ్యవహరించిన తీరును మనం గమనించవచ్చు. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) తమ భార్యలను గొప్ప కరుణ మరియు న్యాయంతో చూసుకున్నారు. నేటి ప్రజలు ఈ విషయాన్ని అర్థం చేసుకుంటే, అనేక గృహ వివాదాలు మరియు ఘర్షణలు పరిష్కరించబడతాయి. కొన్ని సమయాల్లో, వారు (స) భార్యలు కఠినంగా మాట్లాడినా లేదా అసంతృప్తిని వ్యక్తం చేసినా, వారు (స) మాత్రం ప్రశాంతంగా చిరునవ్వు నవ్వి, దానిని పట్టించుకోకుండా ఉండేవారు.

ఒక సందర్భంలో, వారు (స) హజ్రత్ ఆయిషా రజియల్లాహ్ తాలా అన్‌హాతో, "ఓ ఆయిషా, మీరు నాపై అసంతృప్తిగా ఉన్నప్పుడు నాకు ఎల్లప్పుడూ తెలుస్తుంది" అని అన్నారు. మీరు దానిని ఎలా గ్రహిస్తారని ఆమె అడిగారు. దానికి ప్రవక్త (స) "మీరు నాపై సంతోషంగా ఉన్నప్పుడు, ప్రమాణం చేయవలసిన సందర్భం వచ్చినప్పుడు, 'ముహమ్మద్ (స) ప్రభువుపై ప్రమాణం చేసి చెబుతున్నాను, ఇది ఇలాగే ఉంటుంది' అని అంటారు; కానీ మీరు నాపై అసంతృప్తిగా ఉన్నప్పుడు మరియు ప్రమాణం చేయవలసి వచ్చినప్పుడు, 'ఇబ్రాహీం (అ) ప్రభువుపై ప్రమాణం చేసి చెబుతున్నాను, ఇది ఇలాగే ఉంటుంది' అని అంటారు" అని సమాధానమిచ్చారు. ఇది విన్న హజ్రత్ ఆయిషా రజినవ్వి, మీరు సరిగ్గానే అర్థం చేసుకున్నారని ధృవీకరించారు.

ఆ తర్వాత, వారి భార్యలలో మొదటి మరియు పెద్దదైన, వారి కోసం అపారమైన త్యాగాలు చేసిన హజ్రత్ ఖదీజా రజియల్లాహ్ అన్‌హాకు సంబంధించిన వృత్తాంతాలు ఉన్నాయి. ఆమె మరణానంతరం, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) తనకంటే చిన్న వయసున్న భార్యలను వివాహం చేసుకున్నప్పటికీ, హజ్రత్ ఖదీజా రజియల్లాహ్ అన్‌హా తో తనకున్న బంధాన్ని వారు ఎన్నడూ మరచిపోలేదు. ఆమె స్నేహితులు వచ్చినప్పుడల్లా, ప్రవక్త (స) వారిని ఆహ్వానించడానికి నిలబడేవారు, మరియు ఆమె తయారుచేసిన ఏదైనా వస్తువు వారి ముందుకు వచ్చినప్పుడల్లా, ప్రవక్త (స) కళ్ళ నుండి కన్నీళ్లు ప్రవహించేవి.

బదర్ యుద్ధ సంఘటన సమయంలో, ఇంకా ఇస్లాంను స్వీకరించని వారి అల్లుళ్ళలో ఒకరు ఖైదీగా పట్టుబడ్డారు మరియు తన విమోచన ద్రవ్యాన్ని చెల్లించడానికి అతని వద్ద ఎటువంటి సంపద లేదు. అల్లాహ్ ప్రవక్త (స.అ.వ) కుమార్తె అయిన ఆయన భార్య, తన భర్త విడుదల కోసం వేరే మార్గమేదీ లేదని గ్రహించినప్పుడు, తన తల్లి చివరి జ్ఞాపక చిహ్నమైన ఒక హారాన్ని విమోచన ద్రవ్యంగా మదీనాకు పంపింది. ఆ హారాన్ని దైవ ప్రవక్త (స.అ.వ) సమక్షంలో ఉంచినప్పుడు, వారు (స) దానిని గుర్తించారు; వారి కన్నుల నుండి కన్నీరు జాలువారాయి. వారు (స) సహచరులను ఉద్దేశించి ఇలా అన్నారు: "నేను మీకు దీనిపై ఎటువంటి ఆజ్ఞనూ జారీ చేయడం లేదు---ఎందుకంటే అటువంటి ఆజ్ఞను ఇచ్చే హక్కు నాకు లేదు---కానీ ఈ హారం, జైనబ్ (ర.అ) వద్ద మిగిలిన తన తల్లి చివరి జ్ఞాపక చిహ్నమని నాకు తెలుసు. ఒకవేళ మీరు స్వచ్ఛందంగా అలా చేయడానికి సుముఖత చూపిస్తే, ఆ కుమార్తెను ఆమె తల్లి చివరి జ్ఞాపక చిహ్నానికి దూరం చేయవద్దని నేను మీకు సూచిస్తున్నాను." అందుకు సహచరులు ఇలా బదులిచ్చారు: "ఓ అల్లాహ్ ప్రవక్తా! దీనికంటే మాకు మించిన సంతోషం మరొకటి ఏముంటుంది?" తదనుగుణంగా, వారు ఆ హారాన్ని హజ్రత్ జైనబ్ (ర.అ) కు తిరిగి అప్పగించారు.

హజ్రత్ ఖదీజా రజి గారు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) గారి పట్ల చూపిన దయాగుణాలు ప్రవక్త (స)పై ఎంతగానో ప్రభావం చూపాయి, వారు (స) తమ భార్యల సమక్షంలో ఆమెను గురించి తరచుగా ప్రస్తావించేవారు.

ఒక సందర్భంలో, చెప్పబడిన కథనం ప్రకారం, భార్యలలో ఒకరు మరణించినప్పటికీ, ఆమెను ఎక్కువగా పొగిడితే మిగిలిన భార్యల మధ్య అసంతృప్తి లేదా అసూయ భావాలు తలెత్తవచ్చు. అందువల్ల, ఒక సందర్భంలో దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) గారు హజ్రత్ ఆయిషా రజియల్లాహ్ అన్‌హా గారి ముందు హజ్రత్ ఖదీజా రజి ను పొగిడారు, అప్పుడు ఆమె ఇలా అన్నారు, "ఓ అల్లాహ్ యొక్క సందేశవారుడా!, మీరు ఆ వృద్ధురాలి గురించి ఎందుకు ప్రస్తావిస్తూనే ఉన్నారు? ఈ విషయాన్ని ఇప్పుడు వదిలేయండి. సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ఆమె స్థానంలో మీకు యువతులైన మరియు మరింత అందమైన భార్యలను ప్రసాదించాడు." ఇది విన్న దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) గారు ఎంతగానో చలించిపోయి, "ఆయిషా, ఖదీజా నాకు ఎంత గొప్పగా సేవ చేసిందో నీకు తెలియదు" అని అన్నారు.

**(దిబాచా తఫ్సీరుల్-ఖురాన్, అన్వారుల్-ఉలూమ్, సంపుటి 20, పేజీలు 389-393)**

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) గారి ఉత్తమ నైతిక విలువలు ఏ స్థాయిలో ఉండేవి?.

మనం చరిత్రను పరిశీలిస్తే, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) పుట్టక ముందే వారి తండ్రి మరణించారని, మరియు వారి చిన్నతనంలోనే తల్లి కూడా మరణించారని మనకు తెలుస్తుంది. వారు తన జీవితంలోని మొదటి ఎనిమిది సంవత్సరాలు తమ తాతగారి సంరక్షణలో గడిపారు. ఆ తర్వాత, దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) తమ పిన్నాన్న అయిన అబూ తాలిబ్ సంరక్షణలో పెరిగారు. రక్త సంబంధం కారణంగా, మరియు అబూ తాలిబ్ తండ్రి తన మరణ సమయంలో దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) గురించి ప్రత్యేకంగా సలహా ఇవ్వడం వల్ల, అబూతాలిబ్‌కు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) పట్ల ప్రత్యేక ప్రేమ ఉండేది మరియు వారిని ఎంతో శ్రద్ధగా చూసుకునేవారు. అయితే, అబూతాలిబ్ భార్యకు అటువంటి దయగానీ, కుటుంబ బాధ్యతలను నెరవేర్చే స్పృహ గానీ ఉండేవి కావు. ఇంటికి ఎప్పుడైనా ఏదైనా వస్తువు వస్తే, అబూ తాలిబ్ భార్య తరచుగా దానిని మొదట తనసొంత పిల్లలకే ఇచ్చేది మరియు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) కేవలం పసివాడిగా ఉన్న ఆ సమయంలో ఏమాత్రం పట్టించుకునేది కాదు. అబూ తాలిబ్ ఇంటికి తిరిగి వచ్చినప్పుడు, తన అన్న కుమారుడు ఏడవడం లేదా ఫిర్యాదు చేయడం చూడటానికి బదులుగా, తన సొంత పిల్లలు ఏదో తింటూ ఉండటాన్ని గమనించేవాడు, అయితే తన అన్న కుమారుడు ఒక ప్రక్కన కూర్చుని హుందాగా నిలబడి ఉండేవాడు. మరో మాటలో చెప్పాలంటే, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) తన చిన్నతనం నుండే అన్నింటినీ గొప్ప సహనంతో ఓర్చుకున్నారు. అబూ తాలిబ్ తన అన్న కుమారుడిపై ఉన్న ప్రేమతో, కుటుంబ బాధ్యతలను నెరవేర్చాలనే భావనతో ఉప్పొంగిపోయి, తన అన్న కుమారుడి వద్దకు పరుగెత్తుకెళ్ళి, అతడిని కౌగిలించుకుని, "నా ఈ బిడ్డను కూడా జాగ్రత్తగా చూసుకో, నా ఈ బిడ్డను కూడా జాగ్రత్తగా చూసుకో" అని అనేవారు. ఇది తరచుగా జరిగేది.

ఈ వృత్తాంతాన్ని ఉటంకిస్తూ, హజ్రత్ ముస్లేహ్-ఎ-మౌవూద్ రజి ఒక సందర్భంలో ఇలా వ్రాశారు: "దీనికి సాక్షులుగా ఉన్నవారు చెప్పినదేమంటే, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) దీని ఫలితంగా ఎన్నడూ ఫిర్యాదు చేయలేదు, అసంతృప్తిని వ్యక్తం చేయలేదు, లేదా మొండితనాన్ని ప్రదర్శించలేదు, తన పిన్నాన్న పిల్లల పట్ల ఎలాంటి దురభిప్రాయాన్ని చూపలేదు. జీవిత చరమాంకంలో వారి పరిస్థితులు పూర్తిగా మారినప్పుడు, వారు తమ పిన్నాన్న కుమారులైన హజ్రత్ అలీ రజి మరియు హజ్రత్ జాఫర్ రజిల సంరక్షణ మరియు పెంపక బాధ్యతను స్వీకరించి, ఆ బాధ్యతను అత్యుత్తమ రీతిలో నిర్వర్తించారు."

**(దిబాచా తఫ్సీరుల్-ఖురాన్, అన్వారుల్-ఉలూమ్, సంపుటి 20, పుట 393)**

ఈ రోజుల్లో, ప్రజలు యుక్తవయస్సులో కూడా తమ చిన్ననాటి మనస్పర్థలను మనసులో పెట్టుకుని ప్రతీకారం తీర్చుకోవాలని చూస్తుండటాన్ని మీరు గమనించవచ్చు. అయితే, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఎల్లప్పుడూ దయతో వ్యవహరించేవారు. ఈ రోజుల్లో, మనం గమనించేదే మిటంటే, కొంత మందికి తండ్రి లేకపోవడం వల్ల గానీ లేదా మరేదైనా ఇతర కారణం వల్ల గానీ, 14 లేదా 15 ఏళ్ల వయస్సు వచ్చే వరకు కూడా తమ బంధువులతో కలిసి జీవించాల్సి వస్తే, వారు పెద్దవారై, యుక్తవయస్సుకు వచ్చిన తర్వాత కూడా, ఆ బంధువుల నుండి ఏదైనా దుష్ప్రవర్తనకు గురైతే, అటువంటి విషయాలను ఎప్పటికీ మరచిపోకుండా, అవకాశం దొరికినప్పుడల్లా ప్రతీకారం తీర్చుకోవాలని చూస్తారు. అయితే, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఎన్నడూ ప్రతీకారం తీర్చుకోలేదు; దానికి విరుద్ధంగా, సమయం వచ్చినప్పుడు, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) తన కుటుంబ సభ్యులను తన సంరక్షణలోకి తీసుకుని, వారికి నైతిక శిక్షణ ఇచ్చి, వారికి హోదాను కల్పించారు.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వారి ఉత్తమ నైతిక స్వభావానికి సంబంధించి, వారి సహనానికి సంబంధించిన మరో ఉదాహరణను గమనించండి:

ఒకసారి, కుమారుడు మరణించిన ఒక స్త్రీ అతని సమాధి వద్ద దుఃఖిస్తూ ఉంది. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) అటుగా వెళుతూ, "ఓ స్త్రీ, సహనం వహించు. ప్రతి ఒక్కరూ దైవ సంకల్పానికి లోబడి ఉంటారు" అని అన్నారు. ఆ స్త్రీ దైవ ప్రవక్త (స.అ.స)ను గుర్తించలేక పోయింది; దానికి సమాధానంగా ఆమె ఇలా అంది: "నా బిడ్డ మరణించినట్లుగానే మీ బిడ్డలలో ఎవరైనా ఒకరు మరణించి ఉంటే, సహనం అంటే నిజంగా ఏమిటో అప్పుడు మీకు తెలిసేది." దైవ ప్రవక్త (స.అ.స) అక్కడి నుండి వెళ్ళిపోతూ ఇలా అన్నారు: "ఒకరు కాదు, వాస్తవానికి నా ఏడుగురు బిడ్డలు మరణించారు."

**(దిబాచా తఫ్సీరుల్-ఖురాన్, అన్వారుల్-ఉలూమ్, సంపుటి 20, పుట 394)**

అటువంటి సందర్భాలలో, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) తాను గతంలో అనుభవించిన కష్టాల గురించి ఇంతవరకే మాట్లాడేవారు; వారు (స) ఇంతకంటే ఎక్కువగా ఎన్నడూ వ్యక్తపరచలేదు. వారు తన దుఃఖాన్ని మానవాళికి చేసే సేవకు అడ్డురానిచ్చేవారు కాదు.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) యొక్క సహన ప్రమాణం ఎంత గొప్పదంటే, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ వారికి పరిపాలన మరియు అధికారాన్ని ప్రసాదించినప్పుడు కూడా, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ప్రతి ఒక్కరూ చెప్పేది వినడానికి కాసేపు ఆగేవారు. ఎవరైనా కఠినంగా ప్రవర్తించినా, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) మౌనంగా ఉండేవారు మరియు కఠినంగా ప్రవర్తించే వ్యక్తికి ఎన్నడూ కఠినంగా సమాధానం ఇచ్చేవారు కాదు.

చరిత్రలో నమోదు చేయబడిన దాని ప్రకారం, ముస్లింలు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)ను వారి పేరుతో పిలవకుండా, వారి ఆధ్యాత్మిక హోదాతో సంబోధించేవారు; మరో మాటలో చెప్పాలంటే, వారు ప్రవక్త (స)ను "ఓ అల్లాహ్ యొక్క సందేశవారుడా!" అని సంబోధించేవారు. వారి సంప్రదాయాలు మరియు ఆనాటి ఆచారాల ప్రకారం, ముస్లిమేతరులు కూడ ప్రవక్త (స)ను "ముహమ్మద్" అని కాకుండా "అబూ అల్-ఖాసిం" అని పిలిచి గౌరవం చూపేవారు. ఎందుకంటే అబూ అల్-ఖాసిం అనేది ప్రవక్త (స) పుత్రనామం, అంటే "ఖాసిం తండ్రి" అని అర్థం. దీనికి కారణం, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) కుమారులలో ఒకరి పేరు ఖాసిం, ఆ కుమారుడు మరణించారు.

ఒకసారి, ఒక యూదుడు మదీనాకు వచ్చి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)తో వాదనకు దిగాడు. తన వాదన సమయంలో, అతను పదేపదే, "ఓ ముహమ్మద్!, విషయం ఏమిటంటే....." అని చెబుతూ ఉన్నాడు. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఎటువంటి సంకోచం లేకుండా అతనికి సమాధాన మిచ్చేవారు; అయితే, ఆ యూదుడి విధానాన్ని చూసి సహచరులు అసహనానికి గురయ్యారు. చివరికి, ఒక సహచరుడు దీనిని ఇంక చూడలేక, ఆ యూద వ్యక్తితో ఇలా అన్నారు, "వారితో మాట్లాడేటప్పుడు వారిని పేరుతో పిలవడానికి సాహసించ వద్దు. ఒకవేళ 'అల్లాహ్ ప్రవక్త (స)' అని పలకలేకపోతే, కనీసం 'అబూ అల్-ఖాసిం' అని అయినా పిలవండి." దానికి ఆ యూద వ్యక్తి, "వారి తల్లిదండ్రులు పెట్టిన పేరునే నేను ఉపయోగిస్తాను," అని అన్నాడు. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) చిరునవ్వు నవ్వి ఆ సహచరునితో ఇలా అన్నారు, "చూడండి, అతను చెప్పేది నిజమే. నా తల్లిదండ్రులు నాకు ముహమ్మద్ అని పేరు పెట్టారు. అతను నన్ను ఏ పేరుతో పిలుస్తున్నాడో ఆ పేరుతోనే పిలవనివ్వండి, ఎలాంటి కోపాన్ని ప్రదర్శించవద్దు."

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) సహనం ఎంతగా ఉండేదంటే, కొన్నిసార్లు వారు (స) ఏదైనా పని మీద బయటకు వెళ్ళినప్పుడు, దారిలో కొందరు వ్యక్తులు వారిని ఆపి తమ అవసరాలను వారికి తెలియజేయడం ప్రారంభించేవారు. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వారు చెప్పాలనుకున్నది పూర్తి చేసే వరకు అక్కడే నిలబడి ఉండేవారు, ఆ తర్వాత ప్రవక్త (స) తన దారిలో వెళ్ళిపోయేవారు.

అలాగే, కొందరికి కరచాలనం చేసేటప్పుడు అవతలి వ్యక్తి చేతిని కొంతసేపు పట్టుకొని ఉండే అలవాటు ఉంది; అలా జరిగినప్పుడు, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) కూడా అవతలి వ్యక్తి చేతిని పట్టుకొని ఉండేవారు.

ఇది మంచిది కానప్పటికీ, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఎన్నడూ తన చేతిని మరొకరి చేతి నుండి తీయలేదు.

**(దిబాచా తఫ్సీరుల్ ఖురాన్, అన్వారుల్-ఉలూమ్, సంపుటి 20, పేజీలు 394-395)**

అన్ని రకాల అవసరాలు ఉన్న ప్రజలు తమ అవసరాలను వారి ముందు ఉంచుకునేవారు. కొన్నిసార్లు, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వారి అవసరాన్ని తీర్చడానికి వారికి ఏదో ఒకటి ఇచ్చేవారు. అయితే, వారు దురాశకు లోనై, ప్రవక్త (స)ను ఇంకా ఎక్కువ అడిగేవారు, మరియు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వారి కోరికను తీర్చేవారు. కొన్నిసార్లు ప్రజలు అభ్యర్థనలు చేస్తూనే ఉండేవారు, మరియు ప్రతిసారీ, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వారికి ఏదో ఒకటి ఇచ్చేవారు. ఈ పరిస్థితులలో, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఎవరైనా ప్రత్యేకంగా చిత్తశుద్ధితో ఉన్నట్లు చూసినప్పుడు, ఆ వ్యక్తి కోరినది మంజూరు చేసేవారు, ఆ తర్వాత ఆ చిత్తశుద్ధి గల వ్యక్తితో, "నీవు అల్లాహ్‌పై విశ్వాసం ఉంచితే మంచిది" అని మాత్రమే అనేవారు.

ఒకసారి, ఒక సహచరుడు తన అవసరాలను తీర్చుకోవడానికి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)ను డబ్బు కోసం పదేపదే అభ్యర్థించాడు. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) అతని అభ్యర్థనను నెరవేర్చారు; అయితే, చివరగా, వారు ఇలా కూడా అన్నారు, "ఒక వ్యక్తి తన పూర్తి విశ్వాసాన్ని దేవునిపై ఉంచడమే ఉత్తమమైన వైఖరి." ఆ సహచరుడు చిత్తశుద్ధితో పాటు గౌరవప్రదంగా కూడా ఉన్నాడు. గౌరవంతో, అతను తాను పొందిన దానిని తిరిగి ఇవ్వలేదు; అయితే, భవిష్యత్తు గురించి ఆయన ఇలా అన్నారు, "ఓ అల్లాహ్ ప్రవక్త! (సల్లల్లాహు అలైహి వసల్లం), నేను ఇలా చేయడం ఇదే చివరిసారి. ఇప్పటి నుండి, ఎట్టి పరిస్థితులలోనూ నేను ఎవరినీ ఏమీ అభ్యర్థించను."

అదే సహచరునికి సంబంధించి నమోదు చేయబడిన ఒక సంఘటన ఉంది. అందులో ఒక యుద్ధం జరుగుతోంది, మరియు యుద్ధభూమిలో పరిస్థితి అత్యంత ప్రమాదకరంగా ఉంది. ఈటెలు విసరబడుతున్నాయి, ఖడ్గాలు ఝుళిపిస్తున్నారు, మరియు బాణాలు ప్రయోగించబడుతున్నాయి. సైనికులు సైనికులతో పోరాడుతున్నారు, మరియు ప్రజలు చంపబడుతున్నారు. సరిగ్గా దీని మధ్యలో, ఆ సహచరుడు శత్రువులచే చుట్టుముట్టబడినప్పుడు, అతని చేతి నుండి కొరడా జారిపడింది. కాలినడన ఉన్న ఒక తోటి ముస్లిం సైనికుడు, సేనాధిపతి గుర్రం దిగితే అతనికి హాని జరగవచ్చని భావించి, ఆ కొరడాను తీసి తిరిగి అతనికి ఇవ్వడానికి వంగాడు. ఆ సహచరుడు ఆ సైనికుడిని చూసి, "నా సోదరా, అల్లాహ్ సాక్షిగా, కొరడాను ముట్టుకోవద్దు" అని అన్నాడు. అలా చెప్పి, అతను తన గుర్రం నుండి కిందకు దూకి, స్వయంగా ఆ కొరడాను తీసుకున్నాడు. అప్పుడు ఆయన తన సహచరునితో ఇలా అన్నారు, "నేను ఎవరినీ ఏమీ అడగనని దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) గారికి ప్రమాణం చేశాను. ఒకవేళ నేను మాటలతో ఏమీ అడగక పోయినప్పటికీ, అప్పుడు నిన్ను కొరడా పట్టుకోనిచ్చి ఉంటే, ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా నేను నిన్ను అడుగుతున్నట్లుగా కనబడేది అనడంలో సందేహం లేదు. అలా చేయడం నా ప్రమాణానికి విరుద్ధంగా ప్రవర్తించినట్లు అయ్యేది. ఇది యుద్ధభూమి అయినప్పటికీ, నేను నా పనులు నేను చేసుకుంటాను." ఆ ప్రమాదకరమైన పరిస్థితులలో కూడా ఆయన తన ప్రమాణాన్ని గుర్తుంచుకున్నారు.

**(దిబాచతఫ్సీరుల్ ఖురాన్, అన్వారుల్ ఉలూమ్, సంపుటి 20, పుట 395-396)**

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) గారి జీవితంలోని ఈ మరియు అనేక ఇతర వృత్తాంతాలు వారి న్యాయాన్ని, ఇతరుల మనోభావాల పట్ల వారికి ఉన్న గౌరవాన్ని, మరియు పేదల పట్ల వారికి ఉన్న శ్రద్ధను ప్రదర్శిస్తాయి, ఇవన్నీ మనకు ఆదర్శప్రాయమైనవి. పేదల సంపదను వారు కాపాడటం మరియు స్త్రీల పట్ల వారు చూపిన దయతో కూడిన ప్రవర్తన -- ఇంతకుముందు నేను ఇంట్లో ప్రవక్త (స) తన భార్యలతో ప్రవర్తించిన తీరు గురించి ప్రస్తావించాను -- కానీ వారు (స) సాధారణంగా కూడా స్త్రీలతో చాలా దయతో ప్రవర్తించేవారు. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వారి ధన్యమైన జీవితంలో, మానవ సేవ, పొరుగు వారి పట్ల దయ మరియు బంధువులతో మంచిగా ప్రవర్తించడం వంటి విషయాలకు సంబంధించి లెక్కలేనన్ని ఉదాహరణలు కనిపిస్తాయి. వారు ఇతరుల ఆస్తిని కాపాడటానికి ఎలా ప్రయత్నించారో, వారి తప్పులను ఎలా కప్పిపుచ్చారో, సహకారాన్ని ఎలా బోధించారో మరియు దానిని వారు స్వయంగా ఎలా ఆచరించారో అనే పాఠాలతో వారి జీవితం నిండి ఉంది. వారు ఇతరులను ఎలా క్షమించారో మరియు ప్రజల లోపాలను ఎలా కప్పిపుచ్చారో ఉదాహరణగా నిలిచారు. వారు సత్యసంధత, అనుమానాలను నివారించడం మరియు ఇతరుల గురించి చెడుగా ఆలోచించకపోవడంపై మార్గదర్శకత్వం అందించారు. వారు నిరాశకు గురి కావద్దని హెచ్చరించారు, జంతువుల పట్ల కూడా దయ చూపమని ఆజ్ఞాపించారు మరియు మత సహనం గురించి మాట్లాడారు. ఇవన్నీ మనకు ఒక పరిపూర్ణ ఆదర్శంగా నిలిచే ఉదాహరణలు.

నేను ఇంతకు ముందే చెప్పినట్లుగా, ఇన్షా-అల్లాహ్, భవిష్యత్తులో సందర్భాలు వచ్చినప్పుడు నేను ఇటువంటి ఉదాహరణలను ప్రస్తావిస్తూనే ఉంటాను. ప్రస్తుతానికి, నేను ఈ భాగాన్ని ఇక్కడితో ముగిస్తున్నాను మరియు హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాతు వసల్లం) గారి రచనల నుండి ఒక భాగాన్ని చదివి వినిపిస్తాను. వారు (అ) ఇలా పేర్కొన్నారు:

"ఎవరైతే తన వ్యక్తిత్వం ద్వారా, తన గుణగణాల ద్వారా, తన కర్మల ద్వారా, తన చర్యల ద్వారా, మరియు తన ఆధ్యాత్మిక, స్వచ్ఛమైన జీవితమనే శక్తివంతమైన నది ద్వారా జ్ఞానంలోనూ, ఆచరణలోనూ, సత్యసంధతలోనూ, స్థిరత్వంలోనూ పరిపూర్ణమైన శ్రేష్ఠతను ప్రదర్శించి, 'పరిపూర్ణ మానవుడు' అని పిలువబడ్డాడో -- ఆయనే ఆ ధన్యమైన ప్రవక్త, ప్రవక్తల ముద్ర, ఎన్నుకోబడిన వారి నాయకుడు, ప్రవక్తల గర్వకారణం, మన నాయకుడు గౌరవనీయులు ముహమ్మద్ ముస్తఫా సల్లల్లాహు అలైహి వసల్లం. ఓ అల్లాహ్, ఓ ప్రియమైన దేవా, ప్రపంచ ఆరంభం నుండి నీవు మరెవరిపైనా పంపని అటువంటి ఆశీర్వాదాలను, శాంతిని ఈ ప్రియమైన ప్రవక్తపై పంపు."

**(అత్మామే-హుజ్జత్, రూహానీ ఖజాయిన్, సంపుటి 8, పుట 308)**

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) యొక్క ఆదర్శాన్ని అనుసరించి, నిజమైన ముస్లింలుగా మారడానికి కృషి చేసే సామర్థ్యాన్ని సర్వశక్తిమంతుడైన అల్లాహ్ మనకు ప్రసాదించుగాకా!. వారి సందేశాన్ని ప్రపంచమంతటా వ్యాపింపజేసి, తద్వారా మానవాళిని వారి పతాకం క్రిందకు తీసుకువచ్చే సామర్థ్యాన్ని కూడా అల్లాహ్ మనకు ప్రసాదించుగాకా! అలా చేయడానికి సర్వశక్తిమంతుడైన అల్లాహ్ మనకు శక్తిని ప్రసాదించుగాకా!.

**అల్లాహుమ్మ సల్లె అలా ముహమ్మదిన్ వ అలా అలే ముహమ్మదిన్ వ బారిక్ వసల్లిమ్ ఇన్నక హమీదున్ మ్మజీద్.**

ఓ అల్లాహ్!, ముహమ్మద్ (స)పై మరియు ముహమ్మద్ (స) కుటుంబీకులపై ఆశీర్వాదాలు పంపుము. దీవెనలు మరియు శాంతిని అనుగ్రహించుము. నిశ్చయంగా, మీరు స్తుతింపదగినవారు, ఉన్నతమైనవారు.

నమాజ్ తర్వాత, నేను ఒక జనాజ నమాజ్‌ను చదివించుతాను. (జనాజను తీసుకవచ్చారా? అని హుజూర్ గారు అడిగారు.) ఇక్కడ ఒక జనాజ ఉన్నది.

అది యునైటెడ్ కింగ్‌డమ్‌లో మిషనరీగా పనిచేసిన లైఖ్ అహ్మద్ తాహిర్ సాహిబ్ గారిది. ఆయన ఇటీవల 83 సంవత్సరాల వయస్సులో కన్నుమూశారు. ఇన్నా లిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజివూన్. మృతుడు ఒక మూసీ. ఆయన జ్ఞాపకార్థం ఒక కుమార్తె మరియు ముగ్గురు కుమారులు ఉన్నారు.

లైఖ్ తాహిర్ సాహిబ్, హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారి సహచరులైన హజ్రత్ షేక్ ఫజల్ అహ్మద్ బతల్వి రజి గారికి ఖాదియాన్‌లో జన్మించారు. ఆయన తండ్రి 1907లో బైఅత్ చేశారు. మెట్రిక్యులేషన్ తర్వాత, లైక్ సాహిబ్ 1959లో తన జీవితాన్ని అంకితం చేసి, జామియా అహ్మదీయ రబ్వాలో చేరారు. ఆయన 1966లో జామియా నుండి పట్టభద్రులయ్యారు. జామియాలో చదువుతున్న సమయంలో, ఆయన ఎఫ్ఏ, అదీబ్ ఫజిల్ మరియు అరబిక్ ఫజిల్ అర్హతలను కూడా పూర్తి చేశారు. పట్టభద్రులైన తర్వాత, పంజాబ్ విశ్వవిద్యాలయం నుండి బిఏ డిగ్రీని పొందారు. జూలై 1967లో, ఆయన మిషనరీగా ఇంగ్లాండ్‌కు పంపబడ్డారు, అక్కడ ఆయన లండన్‌లోని ఫజల్ మసీదుకు నాయిబ్ ఇమామ్‌గా సేవ చేశారు. 1970లో, ఆయన పాకిస్తాన్‌కు తిరిగి వచ్చి, ఇస్లాహ్-ఓ-ఇర్షాద్ విభాగం కింద వివిధ ప్రాంతాలలో మిషనరీగా తన సేవను కొనసాగించారు. తరువాత, ఆయన తస్నీఫ్ విభాగానికి బదిలీ అయ్యారు. ఆయన మౌలానా అబుల్ మునీర్ నూర్-ఉల్-హక్ సాహిబ్ గారి అల్లుడు. తన సేవా కాలంలో, ఆయన జామియాలో లెక్చరర్‌గా నియమితులై సుమారు 10 సంవత్సరాలు బోధించారు. 1982లో, ఆయన వకాలత్-ఎ-తబ్షీర్ కార్యాలయంలో నాయిబ్ వకీల్-ఉత్-తబ్షీర్‌గా నియమితులయ్యారు. జామియాలో ఉన్న కాలంలో మరియు పాకిస్తాన్‌లో మిషనరీగా ఉన్న సమయంలో, ఆయన ఖుద్దమ్-ఉల్-అహ్మదీయ్యా మరియు ఇతర అనుబంధ సంస్థలలో కూడా సేవలు అందించారు. 1986లో, ఆయన యునైటెడ్ స్టేట్స్‌కు మిషనరీగా నియమించబడ్డారు, కానీ అదే సంవత్సరం తరువాత, హజ్రత్ ఖలీఫతుల్ మసీహుర్రాబేహ్ రహ్మహుల్లాలహ్ గారు ఆయనను యునైటెడ్ కింగ్‌డమ్‌కు పిలిపించి గ్లాస్గోలో నియమించారు, అక్కడ ఆయన మిషనరీగా మరియు ముబల్లీఘ్‌గా సేవ చేశారు. 2005లో, జామియా అహ్మదీయ్యా యూకే స్థాపించబడినప్పుడు, ఆయన దాని మొదటి ప్రిన్సిపాల్‌గా నియమితులయ్యారు. ఆయన జీవితకాల సేవ సుమారు 59 సంవత్సరాలు కొనసాగింది.

లండన్‌లోని ఫజల్ మసీదు ఇమామ్ అయిన అతాల్ ముజీబ్ రాషిద్ సాహిబ్ ఇలా వ్రాశారు: "దివంగత లైక్ అహ్మద్ తాహిర్ సాహిబ్ ఇస్లాం భక్తుడు, ఖిలాఫత్‌కు నమ్మకమైన సేవకుడు మరియు వక్ఫ్-ఎ-జిందగీ యొక్క ఆవశ్యకతలను ఆదర్శప్రాయంగా నెరవేర్చిన వ్యక్తి. ఆయన అత్యంత విజయవంతమైన మిషనరీ, సుదీర్ఘకాలం పాటు అపారమైన భక్తితో జమాఅత్‌కు సేవ చేశారు. ఆయన పవిత్ర ఖురాన్ పఠనం మధురంగా మరియు హృదయాన్ని కదిలించే విధంగా ఉండేది. ఆయన నైతిక బోధన విషయాలపై అత్యంత ఆకట్టుకునే మరియు ప్రభావవంతమైన రీతిలో ప్రసంగించేవారు. ఆయన సేవ చేసిన ప్రతిచోటా, శాశ్వతమైన మరియు మధురమైన జ్ఞాపకాలను మిగిల్చారు. ఆయన విశ్వాసానికి ప్రియమైన సేవకుడు, జమాత్ సభ్యుల పట్ల ప్రేమ మరియు ఆప్యాయతను చూపించారు. ఆయన రచనా రంగంలో కూడా అనేక సేవలు అందించారు. ఆయనకు ప్రార్థన పట్ల ప్రత్యేక భక్తి ఉండేది. ఆయన ఇంటి గోడలపై ప్రార్థనల శాసనాలతో అలంకరించబడి ఉండేది. ఆయన అనేక ఉత్తమ గుణాలను కలిగి ఉన్నారు."

ముబారక్ సిద్ధిఖీ సాహిబ్ ఇలా వ్రాశారు: "ఆయన నాకు రబ్వాలోని రోజుల నుండి తెలుసు. ఆయన చాలా ఉల్లాసంగా, ఉన్నతమైన మరియు గౌరవ ప్రదమైన స్వభావంతో ఉండేవారు. ఖిలాఫత్ పట్ల మరియు జమాత్ యొక్క పరిపాలనా వ్యవస్థ పట్ల ఆయనకున్న భక్తి గాఢమైనది మరియు నిష్కపటమైనది. వర్తమాన ఖలీఫాకు సంపూర్ణ విధేయత చూపమని ఆయన ఇతరులకు ఎల్లప్పుడూ సలహా ఇచ్చేవారు. ఆయన ఎల్లప్పుడూ తన జేబులో ఒక చిన్న నోట్‌బుక్‌ను ఉంచు కునేవారు. తాను విన్న లేదా చూసిన ఏ మంచి విషయాన్నైనా, అది ఎక్కడి నుండి వచ్చినా, వెంటనే అందులో రాసుకునేవారు. ఆయన ఎవరి నుండి మార్గదర్శకత్వం తీసుకోవాలో అనే భేదాన్ని పాటించేవారు కాదు, కానీ ఎక్కడ మంచి మాట విన్నా, దానిని రాసుకునేవారు. తన విద్యార్థి రోజుల నుండి, ఆయన జమాత్ పెద్దల సాంగత్యంలో కూర్చోవడాన్ని అలవాటుగా చేసుకున్నారు. ఆయన హజ్రత్ హాఫిజ్ ముఖ్తర్ అహ్మద్ షాజహాన్‌పురి సాహిబ్ రజి యొక్క అనేక సూక్తులను గుర్తుంచుకొని, తరచుగా తన సమావేశాలలో వాటిని ప్రస్తావించేవారు."

ఆయన కుమార్తె, ఖుర్రతుల్ ఐన్, ఇలా అంటున్నారు: "మా నాన్నగారిలో అత్యంత ప్రస్ఫుటంగా కనిపించే ఒక గుణం ఆయన ప్రార్థన చేసే విధానం. ఆయన ప్రార్థనలు ఆవేశంతో, వినయంతో, దేవునిపై ఆధారపడటంతో మరియు అల్లాహ్ ముందు ప్రేమతో చేసే విన్నపంతో నిండి ఉండేవి. దేవుని నుండి సమాధానం లభించే వరకు ఆయన ప్రార్థన ఆపరేమో అని తరచుగా అనిపించేది. నిజానికి, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ఆయన పట్ల ప్రత్యేక అనుగ్రహం చూపాడు. అనేక సందర్భాలలో, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ వివిధ విషయాల గురించి ఆయనకు కలల ద్వారా ముందుగానే తెలియజేసేవాడు. ఆయన మాకు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారి ఒక సూక్తిని గుర్తు చేసేవారు: 'ప్రశ్నించేవాడు మరణిస్తాడు, కాబట్టి మరణించి ఆ తర్వాత అడగండి.' ఇదే అసలైన విషయం -- అడిగేవాడు మరణించిన స్థితిలో ఉండాలి; మరియు మీరు ఆ స్థితిలో అడిగినప్పుడు, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ తప్పకుండా వింటాడు."

సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ఆయనకు తన క్షమాపణను ప్రసాదించి, ఆయనపై కరుణ చూపుగాకా!. ఆయన స్థానాన్ని ఉన్నతం చేయుగాకా!. ఆయన జనాజ సిద్ధంగా ఉంది, మరియు జుముఆ నమాజ్ తరువాత నేను ఆయన జనాజ నమాజ్‌ను చదించుటకు నేను బయటకు వెళ్తాను.

రెండవది పరోక్ష జనాజ నమాజ్. ఇది మాలిలోని సెగౌ ప్రాంతానికి చెందిన నాయిబ్ సదర్, గౌరవనీయులైన సెగా జల్లో సాహిబ్ గారిది. ఆయన కూడా ఇటీవలే కన్నుమూశారు. ఇన్నా లిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజివూన్. మృతుడు ఒక మూసీ. సెగా జల్లో సాహిబ్ 2016లో ఒక రేడియో కార్యక్రమం విన్న తర్వాత అహ్మదీయత్‌ను స్వీకరించారని మరియు విశ్వాసంలో గొప్ప పురోగతి సాధించారని మిషనరీ తాసిర్ సాహిబ్ రాశారు. ఆయన ఒక భక్తిపరుడు మరియు చురుకైన అహ్మదీ, ఎల్లప్పుడూ జమాత్ కార్యక్రమాలలో మరియు ఆర్థిక త్యాగాలలో ముందుండే వారు. తన ఇల్లు దూరంగా ఉన్నప్పటికీ, ఆయన ప్రతిరోజూ ఫజర్, మగ్రిబ్ మరియు ఇషా నమాజుల కోసం మసీదుకు వెళ్ళేవారు. ఖిలాఫత్ పట్ల ఆయనకున్న ప్రేమ, భక్తి అపారమైనవి. 2018లో, ఆయనకు వసియ్యత్ పథకంలో చేరే భాగ్యం కలిగింది మరియు ఆయన మరణించే వరకు ప్రతి నెలా ప్రారంభంలో క్రమం తప్పకుండా తన వసియ్యత్ చందాను చెల్లిస్తూనే ఉన్నారు. ఒకసారి, ఆఫ్రికాలోని కొన్ని స్థానిక పరిస్థితుల కారణంగా ఆయనకు ఆరు నెలల పాటు జీతం అందలేదు, అందువలన ఆయన తన చందాను చెల్లించలేకపోయినందుకు తీవ్రంగా కలత చెందారు. అల్లాహ్ ఆయనకు ఉపశమనం కలిగించి, జీతం అందినప్పుడు, ఆయన చేసిన మొట్టమొదటి పని తన చందా వసియ్యత్ మరియు ఇతర చందాను చెల్లించడమే.

ఆయనకు భార్య మరియు ముగ్గురు కుమారులు ఉన్నారు. ఆయన తన కుటుంబానికి బోధించేవారు, మరియు అల్లాహ్ దయవల్ల, ఆయన కుమారులలో ఇద్దరు అహ్మదీయత్‌ను స్వీకరించారు, అయితే ఆయన భార్య మరియు ఒక కుమారుడు స్వీకరించలేదు, ఇది ఆయనకు తీవ్ర ఆందోళన కలిగించింది. అహ్మదీయత్ పట్ల ఆయనకున్న విశ్వాసం దృఢమైనది మరియు స్థిరమైనది. అహ్మదీయేతరులు మరియు మత పెద్దల పట్ల ఆయన అభిప్రాయాలు స్పష్టంగా మరియు దృఢంగా ఉండేవి; హజ్రత్ మసీహ్ మౌవూద్ మరియు మహ్దియే మౌవూద్‌ను అంగీకరించనంత వరకు వారు ఎన్నటికీ విజయం సాధించలేరని ఆయన చెప్పేవారు. ఆయన ఒక నిబద్ధతగల ప్రబోధకుడు మరియు జమాత్‌కు చురుకైన సేవకుడు.

సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ఆయనకు తన క్షమాపణను ప్రసాదించి, ఆయనపై కరుణ చూపుగాకా!.

| **అహాదీస్ బోధనలు** | దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా సెలవిచ్చారు: **"ఒక సమాజానికి ప్రారంభములో నేను, అదే సమాజానికి చివరిలో ఈసా ఇబ్నే మరియం ఉన్నచో ఆ సమాజం ఎన్నడు నాశనం కాదు."** (కంజూలుల్ ఆమాల్, హర్ఫ్ అల్ ఖాఫ్, కితాబుల్ ఖియామతు, బాబ్ ఖరూజుల్ మహ్దీ, 38671) |
| --- | --- |

**దుఆ ఆశించువారు:** ***Muhammad Nazeer Ahmad sb, warangal, (Telangana)***

| **అహాదీస్ బోధనలు** | **"ఒక మునల్మానుడి విశిష్ట లక్షణమేమనగా, తన ముసల్మాను సోదరుడిని చూసినప్పుడు అతని కోసం దగ్గరిగా కూర్చోవలెను." అనగా అతనికి కూడ కూర్చొవడానికి చోటును ఇవ్వవలెను.** (మిష్కాతుల్ మసాబిహ్, కితాబుల్ అదబ్, బాబుల్‌ఖియామ్, ఫసలుస్సాలిస్) |
| --- | --- |

**దుఆ ఆశించువారు:** ***Muhammad Vazeer Ahmad sb Babu,***

**(తఫ్సీర్ 1వ పేజి తరువాత)**

వఫీ అమ్వాలిహిం హఖ్ఖున్ ల్లిస్సాయిలి వల్ మహ్రూమి (అజ్జారియాత్ రూకు 1) మానవుని సంపదలో యాచకుల కూడ హక్కు ఉంటుంది. నిరుపేదల హక్కును నిర్ధారించడానికి గల కారణమేమనగా, ప్రపంచంలో పేదవారు, సంపన్నులు మారిపోతుంటారు. నేటి పేదవారు ఒకప్పుడు సంపన్నులుగా ఉండి ఉండవచ్చును. నేటి సంపన్నులు ఒకప్పుడు పేదవారై ఉండవచ్చును. ఆ సమయంలోని సంపన్నులు వారికి ఆర్థిక సహాయం చేసి ఉండవచ్చును. కావున ప్రపంచం మొత్తాన్ని ఒక సమదృష్టితో చూసినట్లయితే ఏ ఒక్కరి సంపద వారి స్వీయ ఆర్జిత సంపదగా కనిపించదు. వాస్తవానికి అందులో ఇతరుల హక్కు తప్పకుండా కలిసి ఉంటుంది. రెండవ కారణమేమనగా, ప్రపంచంలోని వనరులన్నింటిని అల్లాహ్ తాలా మొత్తం మానవజాతి కొరకు సృష్టించాడు. అంతేగాని జైద్ కొరకు, బకర్ కొరకు అని ప్రత్యేకించికాదు. ఒకవేళ జైద్ మరియు బకర్ ఏదో ఒక కారణంతో సంపన్నులైనచో అంతమాత్రమున మిగిలిన వారి హక్కు రద్దు చేయబడదు. మొత్తానికి ప్రపంచిక వనరులలో జైద్ మరియు బకర్ సమానమైన హక్కును కల్గియుంటారు. ఆం ప్రత్యేకించి ఎక్కువ శ్రమపడినందున, జైద్ గాని, బకర్ గాని ఎక్కువ హక్కును కల్గియున్నాడనే విషయాన్ని ఇస్లాం అంగీకరిస్తుంది. అంతేగాని అతనిని సంపద మొత్తానికి హక్కుదారుడిగా అంగీకరించదు.

బాటసారుల హక్కు ఈ విధముగా గలదు. మానవుడు మరొక ప్రాంతానికి వెళ్ళినప్పుడు అతని పట్ల అక్కడి వారు మర్యాదగా వ్యవహరిస్తారు. ఇలా ఇతర ప్రాంతాలకు చెందిన బాటసారులకు సేవ చేసుకోవడం కూడ ప్రాంతీయుల బాధ్యత. తద్వార ఆతిథ్య హక్కు నెరవేరుతుంది. బాటసారుల హక్కును గూర్చి ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా తెలిపారు. మీరు ఏదైన ప్రాంతానికి వెళ్ళినప్పుడు మీరు ఆ ప్రాంతవాసులపై మూడు రోజుల ఆతిథ్యపు హక్కును కల్గియుంటారు. అందుకు అనుచరులు ఇలా విన్నవించుకున్నారు. ఓ రసూలుల్లాహ్! ఒకవేళ ఆ ప్రాంతం వారు ఆతిథ్యం ఇవ్వనిచో ఏమి చేయాలి?. అప్పుడు ప్రవక్త (స) వారి నుండి తప్పకుండ పొందవచ్చును అని తెలిపారు. (అబూదావూద్, సంపుటి 3, కితాబుల్ అత్అమతు, బాబ్ మా జాఅ ఫి జ్జియాఫతి) ఈ ఆదేశం ఇస్లామీయ సాంప్రదాయం కొనసాగునంత వరకు వర్తిస్తుంది. ఎందుకనగా ఆయా రోజులలో ఇతరు ఆ ప్రాంత ముస్లింల నుండి ఆతిథ్య హక్కును పొందగలరు. ఈ ఆదేశాన్ని ఒక వేళ ప్రపంచం మొత్తం పాటింపజేసినచో హోటల్ మరియు లాడ్జిల వంటి వాటి వలన ఉత్పన్నమవుతున్న అనేక చెడులను ప్రపంచం నుండి ప్రారదోలవచ్చును. సేజానికి ఉన్నత శిక్షణకు మూలమైన ఈ ప్రాపంచిక ప్రయాణం కూడ పేదలకు సులభతర మవుతుంది. కాని విచారకరమైన విషయమేమనగా స్వయముగా ముసల్మానులే ఈ విషయాన్ని మర్చిపోయారు.

బాటసారుల పట్ల ఉత్తమముగా వ్యవహరించునట్టి ఈ ఆదేశం అనేక ఉపద్రవాలను అరికట్టుటకు దోహదపడుతుంది. ఎందుకనగా తగాదలు, గొడవలు విధ్వేషం వలన పుట్టుకొస్తాయి. ఇలా ఆతిథ్య సాంప్రదాయం కొనసాగినచో విద్వేషం దూరమవుతుంది. గ్రామాలు, దేశాల మధ్య ఉన్నటు వంటి తగాదలు కూడ కనుమరుగై పోతాయి. ఇతర దేశాల ఆతిథ్యంను పొందిన ప్రజలు ఎన్నడు కూడ ఆయా దేశాలపై త్వరగా పోరాడుటకు సుముఖముగా ఉండరు. ఆం కొంత మంది దుర్మార్గులు, దుష్టులు పోరాడుతుంటారు అది వేరు విషయం. ఆం పై ఆదేశం ద్వార గ్రామాల మరియు ప్రాంతాల వ్యవస్థకు కూడ పునాదులు పడుతాయి. ఎందుకనగా ఆతిథ్యం అనేది గ్రామం మొత్తంపై విధించబడింది. కావున ఆ ఆదేశాన్ని నెరవేర్చుటకు ఆ గ్రామ ప్రజలందరు అతిథుల మర్యాదలను నెరవేర్చుటకు ఒక వ్యవస్థను ఏర్పాటు చేసుకోవడానికి ముందుకు వస్తారు. చివరికి ఈ వ్యవస్థ ఇతర కార్యకలాపాల కోసం కూడ ప్రయోజనకారిగా నిరూపితమవుతుంది.

లా తుబజ్జిర్ మరల ఇలా తెలిపారు. పైన పేర్కొనబడిన ఆదేశంలో ధనమును ఖర్చు చేయుమని ఉపదేశించడం జరిగింది. అంతమాత్రమున ధనమును అడ్డు అదుపు లేకుండా ఖర్చు చేయండి అని ఏ మాత్రం అర్థం చేసుకోవద్దు. దీని అర్థం ముఖ్యమైన అవసరాల కోసం ఖర్చు చేయమని ఆదేశించడం జరిగింది గాని, అనవసర మరియు వృధా ఖర్చులు చేయమని ఆదేశించలేదు.

ఇబ్నే మస్వూద్ ఇలా పేర్కొన్నారు. అత్తబ్జీరు అల్ ఇన్ఫాఖు ఫీ ఘైరి హఖ్ఖిన్ అనగా అనవసర ఖర్చులను అత్తజ్జీరు అని పిలుస్తారు. కావున ఈ ఆదేశంలో ధార్మిక ఖర్చులు పరిగణించబడవు. ధార్మిక అవసరాల కోసం ఒకవేళ ఎవరైన తన పూర్తి సంపదను అల్లాహ్ మార్గంలో ఖర్చు చేసినచో అట్టి ఖర్చు ముబజ్జిర్ అనబడదు. ఎందుకనగా అతడు వృధా ఖర్చు చేయలేదు.

ఖుర్ఆన్ మజీద్‌లో వృధా ఖర్చులను గూర్చి ఇతర ఆధ్యాయములలో ఇలా వివరముగా పేర్కొనబడింది. వల్లజీన ఇజా అన్ఫఖూ లం యుస్‌రిఫూ వలం యఖ్తురూ వకాన బయిన జాలిక ఖవ్వామా (ఫుర్ఖాన్ రూకు 6) అనగా వృధా ఖర్చులు చేయకూడదు, లోభితనంను కూడ చూపించ కూడదు. కాని మధ్యమార్గంను అనుసరించవలెను.

**(తఫ్సీరే కబీర్ సంపుటి 4, పేజి 323-324, ప్రచురణ ఖాదియాన్ 2010)**

---

**(మల్ఫూజాత్ 1వ పేజి తరువాత )**

ఇప్పుడు 40 సంవత్సరాలు గడిచిన తరువాత ఆ సామార్థ్యం లేదు. నిజానికి మొదట్లో నేను బటాల వరకు ఎన్నో సార్లు కాలినడకన వెళ్ళేవాడిని, తిరిగి వచ్చేవాడిని. ఎలాంటి అలసట, బలహీనత నాకు కలిగేది కాదు. కాని నేడు 5 నుండి 6 మైళ్ళ దూరం వెళ్ళిన కూడ అలసట వస్తుంది. 40 సంవత్సరాల తరువాత శరీర ఉత్సాహం బలహీన పడుతూ ఉంటుంది. రక్తం తక్కువ స్థాయిలో తయారవుతుంది. మానవునిపై ఎన్నో బాధలు, ఇబ్బందులు వచ్చి పడుతాయి. నేడు ఒకవేళ ఆలస్యంగా భోజనం చేసినచో ఆరోగ్యం నీరసించి పోతుంది.

**(మల్ఫూజాత్ సంపుటి 2, పేజి 561, ప్రచురణ ఖాదియాన్ 2003)**

---

## నజారత్ తాలీమ్ ఖాదియాన్ వారి వ్యాస రచన పోటి బహుమతుల ప్రకటన:-

భారతదేశంలో ఉన్నటు వంటి అహ్మదీయ విద్యార్థుని, విద్యార్థుల, యువతి, యువకుల, వయోజనుల, మహిళల రచన సామర్థ్యాన్ని పెంపొందించడం కోసం, వారి అంతర్గత నైపుణ్యతలను బయటికి తీయడం కోసం ప్రతి సంవత్సరం నజారత్ తాలీమ్ శాఖ వారు బహమతితో కూడిన వ్యాస రచన పోటిలను నిర్వహిస్తుంటారు.

ఈ సంవత్సరం అనగా 2025-2026వ విద్యా సంవత్సరం కోసం వ్యాస రచన పోటిల శీర్షికలు ఈ విధముగా ఉన్నాయి.

1) గ్రూప్ **A : 8** తరగతి నుండి 12వ తరగతి వరకు గల విద్యార్థిని విద్యార్థులకు గాను....

**"నమాజ్ విశ్వాసాన్ని మరియు దైవ సామిప్యంను పొందుటకు మార్గం."**

2) గ్రూప్ **B :** గ్రాడ్యుయేషన్, పోస్ట్ గ్రాడ్యుయేషన్ మరియు పి. ఎచ్. డి విద్యార్థిని విద్యార్థులకు గాను...

**" సయ్యదినా హుజూర్ అన్వర్ అయ్యదహుల్లాహ్ తాలా ఆకాంక్ష మేరకు ప్రపంచ శాంతి స్థాపనకై అహ్మదీయ యువతి యువకుల కృషీ మరియు బాధ్యత".**

ఈ వ్యాస రచన పోటిలో ప్రథమ, ద్వితిత, తృతియ స్థానాలను పొందిన విద్యార్థిని విద్యార్థుల పేర్లను ప్రకటించడం జరుగుతుంది. వారి వివరాలు ఈ క్రింది విధముగా ఉన్నాయి.

## వ్యాస రచన పోటి బహుమతి: 2025-26

గ్రూప్ **A :**

**1) ఫారాన్ అహ్మద్ సాహెబ్, ఖాదియాన్, ప్రథమం, 2500**
**2) అయిన్ నూహా, మంజీశ్వర్, కెరళా, ద్వితియం, 500**
**3) అఫ్రోజ భేగం సాహిబా, షీదా బారి, అస్సాం, తృతియం, 500**

గ్రూప్ **B :**

**1) అమతుల్ ముజీబ్ సుల్తాన సాహిబా, షిమోగ, కర్ణాటక, ప్రథమం, 5000**
**2) తాషిఫా ఆసిఫ్ సాహిబా, మహ్బూబ్ నగర్, తెలంగాణ, ద్వితియం, 3000**
**3) సయ్యద సఅదియ హమీద్ సాహిబా, హైదరబాద్, తృతియం, 2000**

**(నాజిర్ తాలిమ్ , సదర్ అంజుమన్ అహ్మదియ్య ఖాదియాన్).**

**వర్తమాన ఖలీఫా వాఖ్యములు**

**"అల్లాహ్ మరియు అతని ప్రవక్త పట్ల సంపూర్ణ ప్రేమాభిమానాలు లేనంత వరకు ప్రాపంచిక ప్రేమ తగ్గదు, అదే విధముగా మరణించు సమయంలో మానవునికి మనశ్శాంతి లభించదు, మరణ సమయంలో కల్గె ఆందోళన కూడ దూరం కాదు. "**
**(జుమా ప్రసంగం 14 సెప్టెంబర్ 2018)**

**దుఆ ఆశించువారు:** ***Darga sb, jamat AhmadiyyaVizag (A.P)***



(12వ పేజి తరువాత చదువుము)

మరల ఇలా అన్నారు: గుర్తుంచుకోవలసిన విషయమేమనగా, రెండు ప్రత్యేకతలు ఉన్నట్లయితే మానవుడు అనుగ్రహాన్ని పొందడంలో విజయం సాధిస్తాడనేది అల్లాహ్ సాంప్రదాయం. అవేమనగా, సమయాన్ని కేటాయిస్తూ సాన్నిహిత్యంలో జీవనం గడపడం. రెండవది వారి మాటలను శ్రద్ధగా ఆలకించడం. వారు ప్రసంగించునప్పుడు, ఉపన్యసించునప్పుడు ఒకవేళ ఏదేని అనుమానం, సంశయం కల్గినచో వాటిని దాచుకోకుండా, స్వచ్ఛమైన మనస్సుతో ఆ సమయంలోనే వాటిని గూర్చి ప్రశ్నించి, వాటిని నివృత్తి చేసుకోవలెను.

ముహమ్మద్ అబ్దుల్ హఖ్ఖ్ రజి గారు ఇలా విన్నవించుకున్నారు. మీరు జమాఅత్‌లో చేరడానికి నిర్ణయించిన నిబంధనలనే నేను ఇస్లామీయ నిబంధనలుగా భావిస్తున్నాను. ఎవరైతే తనను తాను ముసల్మానుడిగా ప్రకటించుకుంటాడో వారందరు ఈ నిబంధనలకు అనుగుణముగా తప్పకుండా ఆచరించవలెను.

హ్రజత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇలా తెలిపారు. మన సిద్ధాంతాలలో ఉన్నటు వంటి మరొక ముఖ్యమైన సిద్ధాంతం ఏమిటనగా, మనం ఒక సాధారణమైన జీవితాన్ని జీవించాలి. నేటి కాలంలో యూరోపియన్‌లు జీవనపు విధానాలుగా రూపొందించిన అన్ని దురాచారాలనుండి మనము దూరముగా, పవిత్రముగా ఉండాలి. ఆచార, వ్యవహారాలపై అతిగా పాలన అవసరం లేదు. ప్రతి ఒక్క ఆచారానికి వెసలుబాటు ఉంటుంది. బాధ లేదా పాపము కల్గుతుంది అనే పరిది వరకు ఆచర వ్యవహారాలకు వెసలు బాటు కల్పించవచ్చును. ఇక అన్నపానియాలు మరియు సమావేశాలు, నిష్క్రమణల విషయానికి వచ్చినచో సాధ్యమైనంత వరకు మేము సాధారణ జీవన విధానన్నే ఇష్టపడుతాము.

మరుసటి రోజు కూడ మరల ప్రశ్నోత్తరాల సందర్భములోనే ముహమ్మద్ అబ్దుల్ హఖ్ఖ్ రజి గారు ఆ రోజున హ్రజత్ ఖలీఫతుల్‌మసీహ్ అవ్వల్ రజి గారి ఖుర్‌ఆన్ బోధనలను విని వచ్చినందున ఇలా విన్నవించుకున్నారు. ఇలాంటి (ఖుర్‌ఆన్) అనువాద బోధనల అవశ్యకత చాలా ఉన్నది. చాలా మంది ఇతరుల అనువాదం వలన మోసపోయారు. అంతేగాకా హుజూర్ (అ) నుండి ఒక అనువాదం ప్రచురించబడినచో బాగుంటుందని తమ అభిప్రాయాన్ని వారు వ్యక్తపరిచారు.

ఈ క్రమంలో హ్రజత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇలా తెలిపారు: మన జమాఅత్ వైపు నుండి ఒక ఖుర్‌ఆన్ అనువాదంను ప్రచురించాలనే సంకల్పం నాకు కూడ ఉన్నది. మరల ఇలా తెలిపారు. ఎప్పటి వరకైతే ఖుర్‌ఆన్ సూక్తుల విశ్లేషణ లేకుండా కేవలం ఖుర్‌ఆన్ అనువాదం ఎలాంటి ప్రయోజనాన్ని చూకూర్చదు. ఉదా ॥ ఘైరుల్ మఘ్‌జూబి అలైహిం వలా జ్జాల్లీన్ (ఫాతిహా: 7) అనే సూక్తి ని సాధారణ వ్యక్తులు ఏ విధముగా అర్థం చేసుకోగలరు. అక్కడ యూదులు, క్రైస్తవులు అని అర్థం. ఎప్పటి వరకైతే వివరముగా తెల్పడం జరుగదో, ముసల్మానులకు ఈ దుఆను ఎందుకు నేర్పించడం జరిగిందో అప్పటి వరకు తెలుసుకోలేరు. ఇక్కడ ఉద్ధేశం ఏమిటనగా, ఏ విధముగానైతే యూదులు హ్రజత్ మసీహ్ (అ)ను తిరస్కరించి దేవుని ఆగ్రహానికి గురైనారో, అదే విధముగా చివరి కాలంలో ఈ ముస్లిం సమాజం కూడ మసీహ్ మౌవూద్ (అ)ను తిరస్కరించి దేవుని ఆగ్రహానికి గురి అవుతుంది. అందుకే ప్రారంభంలోనే వారికి భవిష్యవాణి రూపంలో హెచ్చరించడం జరిగింది. తద్వార సహృదయులు అట్టి దైవాగ్రహం నుండి రక్షించబడుదురు.

ఆ తరువాత ముహమ్మద్ అబ్దుల్ హఖ్ఖ్ రజి గారి విన్నపం మేరకు హుజూర్ (అ) గారు అన్నిసా అధ్యాయపు, 185వ సూక్తి వమా ఖతలూహు వమా స్వలబూహు వాస్తవికతను తెలియజేస్తూ అన్య ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. చివరిలో హుజూర్ (అ) తమ ఆకాంక్షను తెలియజేస్తూ ఇలా అన్నారు. మేము నిరంతం దుఆ చేస్తున్నాము. మా చిరకాల ఆకాంక్ష ఏమిటనగా, యురోపియన్ ప్రజలలో ఎవరైన ఒకరు తమ జీవితాన్ని అంకితం చేయడానికి ముందుకు వచ్చినచో బాగుంటుంది. కాని అట్టి వ్యక్తి తప్పకుండా కొంత కాలం మా సాన్నిహిత్యంలో ఉంటూ, నెమ్మది నెమ్మదిగా ముస్లిం సమాజంపై పడిన మచ్చను తుడిచివేయుటకు తగిన అంశాలన్నింటిని నేర్చుకోవలెను. ఈ స్థితిని అధిగమించునట్టి శక్తివంతమైన, ప్రభావంతమైన ఆధారాలను కూడ గ్రహించవలెను. అప్పుడు అతడు విదేశాలకు వెళ్ళి ఈ సేవను చేయగలడు. ఈ సేవా దృక్పథాన్ని భరించుటకు ఒక పవిత్రమైన, శక్తివంతమైన ఆత్మ కావలసి యున్నది. ఎవరిలోనైతే ఈ ఆత్మ ఉంటుందో వారు అత్యున్నత స్థాయికి చెందిన ప్రయోజనకర మానవుడిగా నిలుస్తాడు. దేవుని దృష్టిలో కూడ అతడు అత్యంత వైభవంతుడైన మానవుడిగా భావించబడుతాడు.

ముహమ్మద్ అబ్దుల్ హఖ్ఖ్ రజి గారు (మిష్టర్ చార్లేస్ ఫ్రాన్సిస్ సేవిరైట్ గారు ) రెండు రోజులు ఖాదియాన్‌లో బస చేసిన తరువాత తిరిగి వెళ్ళిపోయారు. భారత దేశం నుండి బయలుదేరి, సింగాపూర్‌కు చేరుకోని అక్కడి నుండి వెస్ట్రేన్ ఆస్ట్రేలియా ఆపై సౌత్ ఆస్ట్రేలియా నుండి ప్రయాణిస్తూ తిరిగి మెల్బోర్నియాకు చేరుకున్నారు.

హ్రజత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాంను కలిసిన తరువాత వారు రజి ఆస్ట్రేలియాకు తిరిగి వచ్చిన తరువాత రెండున్నర సంవత్సరాల అన్వేషణ తరువాత, దుఆల తరువాత అల్లాహ్ తాలా వారికి అహ్మదియ్యత్ అనగా నిజమైన ఇస్లాంను స్వీకరించు భాగ్యమును కల్పించాడు. అలా వారు అహ్మదియ్యత్‌ను స్వీకరించిన విషయం ఏప్రిల్ 1906లో రివ్యూవ్యూ ఆఫ్ రిలిజీయన్స్‌లో ప్రచురించడం జరిగింది.

ఆ తరువాత కొంత కాలానికి వారు అమెరికాకు వలస వెళ్ళారు. సౌత్ కాలిఫోర్నియాలో తన వంతుగా ప్రచారం చేస్తూ ఉన్నారు. 1920లో హ్రజత్ ముఫ్తి ముహమ్మద్ సాధిఖ్ సాహెబ్ రజి గారు ఒక ముబల్లిఘ్ గాఅమెరికాకు వెళ్ళినప్పుడు వారు రజి హ్రజత్ ముఫ్తి సాహెబ్ రజి గారితో నిరంతంర సంప్రదింపలు జరుపుతూ ఉన్నారు.

1922లో అహ్మదియ్య ముస్లిం జమాఅత్ అమెరికాకు చెందిన “ దా ముస్లిం సన్ రైజ్ ” అనే సంచికకు చెందిన 4వ సంచికలో వారి (రజి గారి ) ఒక వ్యాసం ప్రచురించబడింది. వారి రజి (గారి ఫోటో) కూడ ప్రచురించబడింది. వారు రజి తాము అహ్మదియ్యత్‌ను స్వీకరించిన విషయాన్ని ప్రస్తావించారు.

**(తదుపరి సంచికలో చదువుము)**

---

హ్రజత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇలా తెలిపారు:

హ్రజత్ ఖాతముల్ అన్బియా సల్లల్లాహు అలైహి వసల్లం గారి ఘటనలను చూసినచో ఎంతో స్పష్టముగా, ఎంతో ప్రకాశవంతముగా, ఎంతో ప్రత్యేకముగా తెలియు విషయమేమనగా, ఆс హ్రజత్ సల్లల్లాహు అలైహి వసల్లం అత్యున్నత స్థాయికి చెందిన ఏకస్వభావుడు, మరియు స్వచ్ఛమైన మనస్థత్వం గలవారని, దేవుని కోసం తమ ప్రాణాలను సైతం అర్పించుటకు సిద్ధముగా ఉన్నారని మరియు మానవ జాతి సహాయ, సహకారంల నుండి పూర్తిగా ముఖము త్రిప్పుకొని కేవలం దేవునిపై నమ్మకాన్ని పెంచుకొనువారని తెలుస్తుంది. వారు దేవుని ఆకాంక్షలో మరియు ప్రీతిలో లీనమై, అంకితమై దైవ ఏకత్వ ప్రచారం చేయడం వలన ఎలాంటి సమస్యలు తమకు ఎదురవుతాయి?, అన్యారాధుల చేతులో ఎన్ని ఇబ్బందులను, బాధలను, దు:ఖాలను ఎదుర్కొవలసి వస్తుంది? అని ఏ మాత్రం ఆలోచించలేదు. పైగా ఒత్తిడిలను, కఠినత్వాలను, కష్టాలను సంతోషముగా అనుభవిస్తూ తమ దైవపు ఆదేశాలను ఆచరించేవారు. ఇందుకు గాను ఉన్నటు వంటి నిబంధనలను, చేయవలసిన హితోపదేశాలను, ప్రసంగాలను అన్నింటిని వారు చేసి చూపారు. ఏ భయపెట్టు వానిని లెక్కచేయలేదు. మేముమరల నిజాన్ని తెల్పుచున్నాము. ప్రవక్తలందరి ఘటనలను చూసినచో ఇలాంటి భయంకర ఘటనలు ఎదురైన కూడ ఒకే దేవునిపై విశ్వాసాన్ని పెంచుకొని అన్యారాధనను, మానవ పూజను నిర్భయముగా అడ్డుకొని, అంతమంది శత్రువులు ఉన్నా కూడ ఇంతటి పటిష్టత, నిలకడ గల ప్రవక్త మరెవరు లేరని నిరూపించారు. కావున కొంతైన న్యాయబద్ధముగా ఆలోచించండి. ఈ పరిస్థితులన్ని ఏ విధముగా ఆс హ్రజత్ సల్లల్లాహు అలైహి వసల్లం గారి అంతరంగిక సత్యతకు నిదర్శనమో చూడండి. ఇదియే గాకుండా ఒక వివేక వంతుడు ఈ పరిస్థితులన్నింటిని గమనించినచో ఆс హ్రజత్ సల్లల్లాహు అలైహి వసల్లం గారు అవతరించిన కాలాన్ని చూసినచో వాస్తవానికి ఈ కాలంలో కూడ ఒక మహాత్ముడు, ఒక వైభవోపేతుడైన సంఘ సంస్కర్త, ఒక దైవ మార్గదర్శకుని అవసరం తప్పకుండా ఉన్నదని అర్థం చేసుకోగలరు.

J.K WOOD WORKS Mob.9393727201
Spl.Capboard & Interior 7989385296
#8-125/A, Chandanagar, Hyderabad
దుఆ ఆశించువారు: *SK Meera sb, Jagadth giri gutta, Hyderabad, (Telangana)*


Love for All Hatred for None
99493-56387
Prop:Muhammad Saleem
MASROOR HOTEL
TEA,TIFFIN,MEALS,CHICKEN-BIRYANI,FAST-FOOD AVAILABLE HERE
Near Naidu Petrol Pump, Khammam Rd. Warangal (Telengana)
Mohammad Saleem (Naib Ameer Zila Jamat Ahmadiyya Warangal (Telengana)

EDITOR
SYED RASOOL NIYAZ
Mobile. :+91 9876332272
SUB EDITOR:
MUHAMMAD AKBAR
Mobile. :+91 9948692101
e-mail:
teluguweeklybadar@gmail.com

REGISTERED WITH THE REGISTERAR OF THE NEWS PAPERS FOR INDIA AT NO: PUNTEL/2016/68817

Weekly BADAR Qadian బదర్ తెలుగు వార పత్రిక

Qadian- 143516, Distt: Gurdaspur (Pb.) INDIA

POSTAL REG NO GDP-38/2026-2028. Vol. 11. Thursday, 26 MAR - 02 APR 2026, Issue No 13 - 14

ACT.MANAGER
ATHAR AHMAD SHAMIM
Mobile. : +91 98156 39670
e-mail managerbadrqnd@gmail.com
www.alislam.org/badr

ANNUAL SUBSCRIPTION:Rs.600/- (Per Issue: 12/- ) (WEIGHT: 20-50, grms / issue)

## సయ్యదినా హజ్రత్ అమీరుల్ మోమినీన్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారి ఆస్ట్రేలియా పర్యటన 2013.

**హుజూర్ అన్వర్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారు సిడ్నీ నుండి మెల్బోర్నియాకు ప్రయాణించడం. మెల్బోర్నియాలో హుజూర్ అన్వర్‌ను మనస్పూర్తిగా, సాధరముగా స్వాగతించడం.**

**వ్యక్తిగతమైన మరియు కుటుంబపరమైన జమాఅత్ సభ్యుల కలయికలు, ఆస్ట్రేలియాకు చెందిన జాతీయ మీడియా చానల్ ABC లో హుజూర్ అన్వర్ గారి ఇంటర్వ్యూ ప్రసారం.**

కార్యక్రమము ప్రకారంగా 5 గంటల 10 నిమిషాలకు హుజూర్ అన్వర్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారు కార్యాలయానికి విచ్చేశారు. ఆపై వివిధ కుటుంబాలకు చెందిన సభ్యులను కలిసారు. ఈ రోజు మెలిబోరెన్ జమాఅత్‌కు చెందిన 49 కుటుంబాలకు చెందిన 217 మంది సభ్యులు తమ ప్రియమైన ఖలీఫాను కలిసే భాగ్యాన్ని పొందారు. ఆయా కుటుంబీకులందరు హుజూర్ అన్వర్ గారితో ఫోటో తీసుకునే అదృష్టాన్ని కూడ పొందారు. హుజూర్ అన్వర్ గారు ప్రేమతో విద్యార్థిని విద్యార్థులకు పెన్నులను బహుకరించగా, చిన్న పిల్లలకు చాక్లెట్స్‌ను పంచిపెట్టారు.

ఈ కార్యక్రమము రాత్రి 8 గంటల 30 నిమిషాల వరకు కొనసాగింది. ఆ తరువాత హుజూర్ అన్వర్ గారు మస్జిద్‌కు విచ్చేసి మగ్‌రిబ్ మరియు ఇషా నమాజ్‌లను కలిపి చదివించారు. నమాజ్‌ల తరువాత హుజూర్ అన్వర్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారు తమ నివాసానికి వెళ్ళిపోయారు.

మెలిబోరెన్ భూభాగానికి దక్కిన మరొక అదృష్టమేమనగా ఈ నగరంలో జన్మించినటు వంటి ఒక ఆస్ట్రేలియన్ నివాసి మిష్టర్ చార్లేస్ ఫ్రాన్సిస్ సెవిరైట్ గారు హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారిని సందర్శించారు. ఆ తరువాత హుజూర్ (అ) గారి బైఅత్ చేయు భాగ్యాన్ని కూడ పొందారు. అలా వారు అనుచరులు (సహబాల) పరిగణలోకి చేరుకున్నారు.

1903 వ సంవత్సరం అస్ట్రేలియాకు ఎంతో చారిత్రాత్మక ప్రాధాన్యత గలదు. ఈ సంవత్సరం హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారి సందేశం మొదటిసారిగా ఆస్ట్రేలియా భూభాగానికి చేరుకున్నది. ఫలితముగా ఒక సహృదయుడైన హజ్రత్ సూఫి హసన్ మూసా ఖాన్ సాహెబ్ రజి గారికి ఆ సందేశాన్ని స్వీకరించే భాగ్యము లభించింది. అదే విధముగా ఆ సంవత్సరంలోనే ఆస్ట్రేలియాకు చెందిన మరొక వ్యక్తికి ఖాదియాన్‌లో హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలంను సందర్శించే భాగ్యము లభించింది. ఆ ఆస్ట్రేలియా వ్యక్తి మిష్టర్ చార్లేస్ ఫ్రాన్సిసీ గారు 1896లో ఇస్లాంను స్వీకరించిన తరువాత తన పేరు “ ముహమ్మద్ అబ్దుల్ హఖ్ ” గా నామకరణం చేసుకున్నారు. వారు రజి 1906వ సంవత్సరంలో హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం గారి బైఅత్ చేసి అహ్మదియ్య ముస్లిం జమాఅత్‌లో చేరిపోయారు.

వారు రజి 1862వ సం॥లో మెలెబోరన్‌లో జన్మించారు. వారు ఒక క్యాథలిక్ కుటుంబానికి చెందినవారు. వారు చాలా సంవత్సరాల పాటు “ బ్రిటీష్ అండ్ ఇండియన్ ఎంపైర్ లీగ్ ” కు ప్రతినిధిగా ఇండియాలో పర్యటించారు. ఇలాంటి ఒక పర్యటణలోనే అక్టోబర్ 1903లో వారు ఖాదియాన్‌లో హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాంను కలుసుకున్నారు. వారు తమ పర్యటణలో భాగంగా లాహొర్‌లో ఉన్నారు. ఆ సమయంలో వారు పూర్తిగా ఇస్లాంను ప్రతి భింభింప జేయునట్టి ఒక ముస్లిం ధార్మిక పండితున్ని కలవాలనే అన్వేషణలో ఉన్నారు. తద్వారా వారి నిజమైన సాన్నిహిత్యం వలన తాను కూడ స్వయముగా ఒక మహాత్ముడిని కావాలని భావించారు. ఈ అన్వేషణ క్రమంలోనే వారు లాహొర్‌లో ఉండగా హజ్రత్ మియాం మిఅరాజొద్దీన్ ఉమర్ సాహెబ్ మరియు తయ్యాబ్ నూర్ ముహమ్మద్ అహ్మద్ సాహెబ్ గార్లను కలిసారు. ఆ ఇరువురు వారికి మీరు ఖాదియాన్‌కు వెళ్ళమని సలహా ఇచ్చారు. అందువలన వారు 22 అక్టోబర్ 1903న ఖాదియాన్‌కు చేరుకున్నారు. అక్కడ వారిని ఎంతో గొప్పగా స్వాగతించడం జరిగింది. వారు రెండు రోజుల పాటు ఖాదియాన్‌లో ఉన్నారు. ఆ సమయంలో వారు హజ్రత్ మౌల్వీ నూరొద్దీన్ సాహెబ్ రజియల్లాహ్ అన్‌హ్ గారి ఖుర్‌ఆన్ బోధనల నుండి ప్రయోజనత్మాక విజ్ఞానాన్ని పొందారు. ఆ తరువాత హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాంను కలిసారు. కొన్ని ప్రశ్నోత్తరాల కార్యక్రమము కూడ జరిగింది. వాటి వివరాలు మల్ఫూజాత్ సంపుటి 3 పేజి 445 ప్రచురణ 2003 రబ్వాలో పొందుపర్చబడ్డాయి.

హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం మరియు ముహమ్మద్ అబ్దుల్ హఖ్ సాహెబ్ రజి గార్ల మధ్య కొనసాగిన సంభాషణలను సంక్షిప్తముగా ఇక్కడ పేర్కొనడం జరుగుతుంది.

ఆధ్యాత్మిక అనుబంధాన్ని గూర్చిన ముహమ్మద్ అబ్దుల్ హఖ్ రజి సాహెబ్ గారి ప్రశ్నకు సమాధానం ఇస్తూ హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇలా అన్నారు. మన మతమైన ఇస్లాం విధానాల పరంగా చూసినచో ఆధ్యాత్మిక అనుబంధం కేవలం దుఆ మరియు ఆసక్తితో ముడిపడి ఉన్నది. కాని వీటినుండి ప్రయోజనాన్ని పొందడం కోసం సమయాన్ని కేటాయించాలి. ఎందుకనగా ఎప్పటి వరకైతే ఒకరితో మరికరి అనుబంధం పటిష్టం కాకుండా, మనస్సులో అభిమానం ఏర్పడకుండా అది ఎలాంటి ప్రభావాన్ని చూపదు. మార్గదర్శకానికి మార్గం కూడ ఈ దుఆ మరియు ఆసక్తియే. నామమాత్రపు మాటలు, చేతలు, పదాలతో ఎలాంటి ప్రయోజనం చేకూరదు.

ముహమ్మద్ అబ్దుల్ హఖ్ సాహెబ్ రజి గారు నా స్వభావం ఆధ్యాత్మిక ఐక్యతను ఇష్టపడుతుందనే భావనను వ్యక్తపరిచారు. కావున నేను ఆ అన్వేషణలో ఉన్నాను. దానిని పొందాలని తపన పడుతున్నాను. నేను ఖాదియాన్‌లో ప్రవేశించిన సమయం నుండి నా మనస్సు సంతృప్తి చెందడాన్ని నేను గమనిస్తున్నాను. ఇప్పటి వరకు నేను ఎవరెవరినైతే కలిసానో వారందరితో నాకు చాలా పురాతన అనుబంధం ఉన్నట్లుగా అనిపిస్తుంది.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇలా అన్నారు: అల్లాహ్ సృష్టి ధర్మం ప్రకారం ప్రతి ఆత్మ ఒక సాంచను కోరుకుంటుంది. ఎప్పుడైతే సాంచ తయారు అవుతుందో, అప్పుడు స్వయముగా ఆత్మ ఊదబడుతుంది. అల్లాహ్ తాలా ఏ వాస్తవాన్ని అయితే నాకు తెలియజేశాడో, దానిని మీరు నెమ్మది నెమ్మదిగా తప్పకుండా తెలుసుకోవాలి. చూడండి! ఒకానోక కాలంలో ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఒంటరిగా ఉన్నారు. కాని ప్రజలు నిజమైన దైవభీతి వైపు ఆకర్శింపబడేవారు. కాని నేడు లక్షలాది మౌల్వీలు, ప్రసంగీకులు ఉన్నారు. కాని వారిలో న్యాసత్వం లేనందున, ఆధ్యాత్మికత లేనందున వారి ద్వార అట్టి ప్రభావం చూపబడడం లేదు. మానవుని విషపూరిత భావజాలలు ఉంటాయి. అవి నామ మాత్రపు మాటలు, చేతలతో దూరం కావు. అందుకే సత్యవంతుల సాన్నిహిత్యం మరియు వారి ప్రభావం చాలా అవసరం. ఈ కారణం చేతనే అనుగ్రహింపబడుటకు వారికి ప్రతిరూపాలుగా మారాలి. వారికి అల్లాహ్ తాలా నేర్పించిన సరైన సిద్ధాంతాలను అర్థం చేసుకోవడం కూడ చాలా ముఖ్యం.

**(11వ పేజిలో చదువుము)**

Printed & Published by: Jameel Ahmed Nasir on behalf of Nigran Board of Badar. Name of Owner: Nigran Board of Badar. And printed at Fazle-Umar Printing Press. Harchowal Road, Qadian, Distt. Gurdaspur-143516, Punjab. And published at office of Weekly Badar Mohallah - Ahmadiyya, Qadian Distt. Gsp-143516, Punjab. India. Editor:Syed Rasool Niyaz